Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఏప్రిల్ 10, 2026 | సంపుటి - 20 | సంచిక 207 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## సైనిక బలగాలు
# ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి
### స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్-అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే 2లో



పాక్‌ను ముందు పెట్టి
## అమెరికా నాటకం

హోర్ముజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ

లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి

న్యూఢిల్లీ : 40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. 2లో



2

పాకిస్థాన్‌పై మాకు
## నమ్మకం లేదు

**ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే.

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్
# అన్నివిధాల ఆదరించింది



గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా

పొంగులేటిపై ఆరోపణలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి

మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిం దన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. 2లో



## జూన్ 2నుంచి స్కూల్
# విద్యార్థులకు అల్పాహారం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

ఖమ్మం : కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన 2లో



# బిఆర్ఎస్ లోకి జీవన్‌రెడ్డి

కెసిఆర్‌తో కలసి రాష్ట్రం కోసం పనిచేస్తా

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు చింతిస్తున్న జనం

27 నెలలుగా కాంగ్రెస్‌లో క్షోభ అనుభవించాను

మీడియాతో మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆవేదన

*తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు.*

జగిత్యాల : తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడ వచ్చని అన్నారు. 27 నెలలుగా చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గురయ్యాను. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ఓటేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచింది. తరువాయి 2లో

## రేవంత్ కన్నా...
# కెసిఆర్ పాలనే బెటర్

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్

- తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది
- జాతీయ స్థాయిలో బిజెపి.. రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

2లో

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

భారీగా పోలింగ్ శాతం నమోదు

అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం



న్యూఢిల్లీ : అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126) 2లో

# పొంగులేటి కాదు.. పొంగులాటీ



బాంబులు పేలుతాయన్న బాంబులేటి

అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు

క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు

నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే..హైడ్రా ఎందుకు వెళ్లలేదు

గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం

వనపర్తి : పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. 2లో



## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

అమరావతి గురించి మాట్లాడుకోండి

అచ్చన్నాయుడు వ్యాఖ్యలు అహంకారపూరితం

మండిపడ్డ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం : వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నా రని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించడానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. 2



వైఎస్ మరణం వేళ.. సిఎం
## పదవి కోసం ఎత్తులు

**ఆనాడు సంతకాల సేకరణలో జగన్ బిజీ**

**బొత్స కూడా వైఎస్ మృతిపై అనుమానించారు**

**ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు**

అమరావతి : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడు తారా? అని ప్రశ్నించారు. ఏం జరిగిందో నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా? అని విమర్శించారు. 2లో



మూడు రాజధానులంటూ
## రుషికొండను మింగారు

ఇప్పుడేమో మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు

వైఎస్సార్ పేరు తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు

జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల 2లో

## ప్రజలకు సుపరిపాలన
# అందిస్తున్నాం



**21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం**

**జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి**

**విభజన కన్నా జగన్ వల్లనే ఎపి నష్టపోయింది**

**'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**

**బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత**

బాపట్ల : ప్రజలకు సుపరిపాలన అంది స్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని.. దానిని నిలబెట్టు కున్నామని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు. తరువాయి 2లో

# సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

## పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# పొంగులేటి కాదు.. పొంగులూటీ

ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పంపించి, కాంపౌండ్ వాల్ కూలగొట్టి, ఆక్రమణలను కూల్చి రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలన్నారు. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటీ అని దుయ్యబట్టారు. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుందని హరీశ్ రావు ప్రశ్నించారు.

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

# జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. 'అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. 837 మంది గాయాల పాలయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేసింది. మెరికా- ఇరాన్ మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో హిజ్బుల్లాను చేర్చలేదని పేర్కొంటూ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక చర్యకు ట్రంప్ మద్దతు తెలిపారు. 'లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యను ఒప్పందం నుంచి ఎందుకు మినహాయించార'ని ప్రశ్నించగా.. 'హిజ్బుల్లా కారణంగానే లెబనాన్‌ను ఒప్పందంలో చేర్చలేదు. అది కూడా త్వరలోనే పరిష్కారమవుతుంది. ఫర్వాలేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

జగిత్యాల : రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడి యాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# వైఎస్ మరణం వేళ.. సిఎం పదవి కోసం ఎత్తులు

అప్పుడు రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు. మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది



సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్య సమాజంలో ఎవరూ ఇలాంటి పనులు చేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే.. ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకుని ఎలా ప్రవర్తించారో చూశాం. తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు ఎలా సేకరించారో చూశాం అని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంపై జగన్‌కు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్డీఏపై అచంచల విశ్వాసంతో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. 22 నెలల్లోనే కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని చెప్పారు. 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యారని... నాడు వారి ఆర్థిక పరిస్థితి ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌ను జగన్ మానసిక క్షోభకు గురిచేసినట్లు చెప్పారు. వైఎస్ చనిపోయినప్పుడు జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. 'వైఎస్సార్ ఆచూకీపై అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం జగన్ పాకులాడతారా? ఏం జరిగిందో నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు సేకరిస్తారా? ఇతర రాష్ట్రాల్లో జగన్ ఉండాల్సిన అవసరం ఏంటి?' అంటూ మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు. బాబాయిని కిరాతకంగా చంపింది జగన్ కాదా అని మంత్రి నిలదీశారు. తల్లి, చెల్లిని రోడ్డున పడేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. పదవి గురించి తప్ప.. జగన్‌కు మరో ఆలోచన లేదని విమర్శించారు. వైఎస్ మృతిలోనూ జగన్ పాత్ర ఉందన్న అనుమానాలున్నాయని తెలిపారు. సైకోకు పదవి ఇస్తే ఎలా ఉంటుందో జగన్ పాలన చూస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని బొత్స సత్యనారాయణనే మాట్లాడారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినా.. కాంగ్రెస్‌లోనే కొనసాగా. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తా అని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరుతానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని..కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా స్నేహం ఉంది. గతంలోనూ ఆయన్ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం. కాంగ్రెస్‌తో అనుబంధం వల్ల జీవన్‌రెడ్డి గతంలో పార్టీ మారలేదు. ఇప్పుడు మరోసారి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాం. రెండ్రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారు. రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు. హామీలు అమలు చేయకుండా అనవసర మాటలు మాట్లాడుతున్నారు. ఇదిలావుంటే సీఎం రేవంత్ రెడ్డి భాషపై జనాల్లో చర్చ జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.

## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా అంటూ అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నాయుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగజారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు. తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు బాధాకరమన్నారు. వైఎస్ మరణంపై అచ్చెన్నాయుడు దిగజారి విమర్శలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్‌తో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తన మంత్రి పదవితో అచ్చెన్న ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. జగన్‌పై రాజకీయ విమర్శలు ఎన్నైనా చేయండని.. వైఎస్ఆర్ మరణం ప్రస్తావన తీసుకురావడం అప్రస్తుతమని తెలిపారు. కావాలంటే పాత వీడియో క్లిప్పింగులు చూసుకోవచ్చన్నారు. మావిగన్ నచ్చకపోతే అమరావతే కావాలని చెప్పండని తెలిపారు.

## మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు

అమరావతి : వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదేనా వారసత్వం అంటే అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్చాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. 'వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారని షర్మిల ప్రశ్నించారు.

# గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక సదుపాయాలు

### పుష్కరాల ఏర్పాట్లపై సి.ఎస్ సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్ 9 : రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈ.ఎన్.సి.లు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

# వరి కొనుగోలు మరో 2 నెలలు పెంచాలి

### కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ

హైదరాబాద్,ఏప్రిల్ 9 : వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడవు పెంచాలని కోరారు. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒ.ఎం.టి.లకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

# దృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక పాఠశాల

ఖమ్మం,ఏప్రిల్ 9 : ఖమ్మం జిల్లాలో దృష్టి లోపం గల విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల వినతులు, ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక -ప్రజా పాలన లో భాగంగా ముందుకు వచ్చారు. ఖమ్మం నగర నడిబొడ్డున గల నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రత్యేక అవసరాలున్న, దృష్టిలోపం విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలగా సర్వాంగ సుందరంగా, అత్యాధునిక వసతులతో ప్రత్యేక పాఠశాలగా తీర్చి దిద్ది, అందుబాటులోనికి తీసుకొనిరావడం జరిగినది. అంధ విద్యార్థులు సమాజంలో సమాన అవకాశాలు పొందాలి, వైకల్యం వారి చదువుకు అడ్డంకి కాకూడదు, అనే లక్ష్యంతో ఈ పాఠశాల స్థాపించబడిందని పేర్కొన్నారు.

# శంషాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్,ఏప్రిల్ 9 : గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ఈగల్ టీం, పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో తరచూ డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టులో మరోసారి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ. 4.6 కోట్ల విలువ చేసే 13.2 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్ వేస్ ఫ్లైట్ లో వచ్చిన ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేయగా గాంజా లభ్యమైనట్లు తెలిపారు అధికారులు. అతడి నుంచి 13.2 కిలోల హైడ్రోఫోనిక్ గాంజా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అధికారులు.ప్రయాణికుడితో పాటు డ్రగ్స్ నెట్వర్క్ నిర్వహిస్తున్న మరో నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు. 2025-26 సంవత్సరంలో మొత్తం 160 కిలోల హైడ్రోఫోనిక్ గంజా స్వాధీనం చేసుకొని 30 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు.

# తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

మంత్రి సీతక్క వ్యాఖ్యలు

మహబూబాబాద్,ఏప్రిల్9 : తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కట్టించిన సైబర్ నేరగాడు

### కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ

### పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే



జనగామ,ఏప్రిల్9 : ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం జీవన్‌రెడ్డి

### రాజకీయాల్లో నిఖార్సయిన నేత

### జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కెటిఆర్

జగిత్యాల : ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పటి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా.. బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్లాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు.. 2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

# పెద్ద ముప్పును తప్పించే హెచ్‌పీవీ టీకా

### విజయవంతంగా ముందుకెళ్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం

### ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో కార్యక్రమం ఏర్పాటు

### కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ

విజయవాడ,ఏప్రిల్ 9 : ఒక్క టీకా పెద్ద ముప్పును తప్పిస్తుందని.. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు. గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని సందర్శించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా కార్యక్రమంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని.. సమయానికి టీకా వేయడం ద్వారా ఇది పూర్తిగా నివారించగల వ్యాధి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్దిష్ట మార్గదర్శకాల ఆధారంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని వివరించారు. దేశంలోని బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును బహుమతిగా అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం అమలవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెళ్వేశ్వరి, జేడీ డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే దేశంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని.. వివిధ స్థాయుల్లో సమగ్ర, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య పరిశోధనలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కేంద్ర ఆరోగ్య, శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు.

# 11 రోజుల్లో రెట్టింపు డబ్బు

### డాక్టర్‌ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

### ఏకంగా రూ.12.31 కోట్లు దోచేసిన దుండగులు

పుణె,ఏప్రిల్ 9 : పుణెలో 75 ఏళ్ల వైద్యుడు సైబర్ మోసగాళ్ల చేతిలో భారీ దోపిడీకి గురయ్యారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా 11 రోజుల్లో డబ్బు రెట్టింపు అవుతుందంటూ దుండగులు నమ్మించి అతడి నుంచి ఏకంగా రూ.12.31 కోట్లు దోచేశారు. చివరికి మోసపోయానని తెలుసుకున్న ఆ వృద్ధుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మీ వద్ద ఉన్న డబ్బుని పెట్టుబడి పెడితే 11 రోజుల్లో రూ.54 కోట్లు చేస్తామని సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుడిని నమ్మించారు. డబ్బుపై అత్యాశతో వారు పంపిన వివిధ బ్యాంకు ఖాతాలకు అతడు ఎనిమిది విడతలుగా డబ్బును బదిలీ చేశారు. ఇదంతా జనవరిలోనే మొదలైంది. 'మీరు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఆ మొత్తానికి రెండితల లాభాలు వస్తాయి' అంటూ ఓ గుర్తు తెలియని నంబరు నుంచి బాధితుడి మొబైల్ ఫోన్‌కి ఈ ఏడాది జనవరిలోనే మెసేజ్ వచ్చింది. దీనిపై బాధితుడు ఆసక్తి చూపడంతో సైబర్ నేరగాళ్లు అతడిని అనే వాట్సప్ గ్రూప్‌లో చేర్చారు. నిందితులంతా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడితే ఎలాంటి లాభాలు పొందొచ్చనే అంశాలపై ఆ గ్రూప్‌లో చర్చించేవారు. దీంతో బాధితుడికి వారిపై నమ్మకం కుదిరింది. వారు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తే కేవలం 11 రోజుల్లోనే డబ్బు రెట్టింపు అవుతుందని పదే పదే చెప్పేవారని పోలీసులు పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్ల వలకు చిక్కిన ఆ వైద్యుడికి అంతర్జాతీయ ట్రేడింగ్ కంపెనీని పోలిన ఓ మోసపూరిత యాప్ లింక్‌ని పంపించి అందులో వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో బాధితుడు మార్చి 7 నుంచి 18 మధ్య మొత్తంగా రూ.12.31 కోట్లు బదిలీ చేశాడు. నకిలీ యాప్‌లో లాభాలు వచ్చాయంటూ, నగదు రెట్టింపు అయిందంటూ భ్రమలు కల్పించారు. మరింత పెట్టుబడి పెట్టాలంటూ వారు బలవంతం చేశారు. బాధితుడు సంకోచించడంతో అకౌంట్‌లో ఉన్న నగదును సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

### షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్

### బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు

హైదరాబాద్,ఏప్రిల్9 : భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

### కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్న సీతక్క

మహబూబాబాద్,ఏప్రిల్9 : జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

### మాటువేసి దుండుగుడి పట్టివేత

నల్లగొండ,ఏప్రిల్ 9 : కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా డాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

### వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

హైదరాబాద్,ఏప్రిల్ 9 : తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 - ఏప్రిల్ 22, 2016 - ఏప్రిల్ 22, 2017 - ఏప్రిల్ 16, 2018 - ఏప్రిల్ 13, 2019 -ఏప్రిల్ 18, 2020 - జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021-జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 - జూన్ 28, 2023 - మే 9, 2024 - ఏప్రిల్ 24, 2025 -ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము.

# సంపాదకీయం

## ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహ్రైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# ఆ రెండు రాష్ట్రాలు హ్యాట్రిక్ సాధిస్తాయా?



కేరళ, అసోం రాష్ట్రాల్లోను, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం లోనూ గురువారం (ఏప్రిల్ 9) ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి పుదుచ్చేరి ఎన్నికల గురించి ప్రత్యేకంగా చర్చించవలసిందేమీ లేదు. కేరళ, అసోంల్లో ఈసారి ప్రభుత్వ వ్యతిరేకత బలమైన అంశంగా పనిచేయదని తెలుస్తోంది. కేరళలో సిపిఎం నేతృత్వం లోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రస్తుతం ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రభుత్వ వ్యతిరేకతతోను, కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)తోనూ గట్టిగా పోరాడుతోంది. ఈ రెండు ఫ్రంట్‌లకు చెందిన సభ్యులంతా జాతీయ స్థాయిలో సంయుక్త వ్యతిరేక వేదికలో భాగస్వాములే అయినప్పటికీ, కేరళ రాష్ట్రంలో మాత్రం ఒకరితో ఒకరు నువ్వానేనా అనే రీతిలో ఢీకొంటున్నారు. బిజెపి విషయానికి వస్తే రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పార్టీగా ఆ పార్టీ ఇంకా నిరూపించుకోవలసి ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2021లో కేరళ రాజకీయ చరిత్రను తిరగరాస్తూ దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ కేరళలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయాన్ని బద్దలు కొట్టి రెండోసారి అధికారం లోకి వచ్చింది. ఇప్పుడు మూడోసారి కూడా విజయం సాధించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాలన్న పట్టుదలతో ఉంది. గత పదేళ్లలో లైఫ్ మిషన్, సామాజిక భద్రత పెన్షన్లు, అత్యంత పేదరిక నిర్మూలన, విద్య, వైద్య రంగాల్లో మార్పు, కూలీలకు కనీస వేతనం వంటి పథకాలు అమలు చేశామని, అవే తమను గెలిపిస్తాయని ఎల్‌డిఎఫ్ విస్తృతంగా ప్రచారం చేసింది. లైఫ్ మిషన్ పథకం కింద ఐదు లక్షల ఇళ్లను పేదల కోసం నిర్మించి పంపిణీ చేసింది. పేదరిక నిర్మూలన పథకం కింద దాదాపు 64,000 కుటుంబాలకు విముక్తి కలిగించింది. వ్యక్తిగత విమర్శల కంటే 'ప్రదర్శన ఆధారిత రాజకీయాల'పై ఎల్‌డిఎఫ్ దృష్టి సారించింది. అయితే రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు, పెన్షన్ల పంపిణీలో జాప్యం వంటివి విపక్షాల విమర్శలకు దారితీశాయి. ఇదిలా ఉండగా సిపిఎం పార్టీకి ఈసారి అనుకోని ప్రతిఘటనలు ఎదురయ్యాయి. అనుభవజ్ఞులైన, కీలకమైన సీనియర్ నేతలు ఐదుగురు పార్టీని విడిచిపెట్టి కాంగ్రెస్ మద్దతు గల యుడిఎఫ్ ఇండిపెండెంట్లుగా తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. మరిన్ని కనుగొనండి టెక్ గాడ్జెట్‌లు ఆధ్యాత్మిక పుస్తకాలు రాజకీయ పుస్తకాలు ాశ్రీంశీ =ఋ – రాంజీ గోండ్ వర్ధంతి ఎప్పుడు? వీరిలో కొంతమంది 1967 నుంచి సిపిఎంకు కంచుకోట వంటి పయన్నూర్ వంటి స్థానాల్లో పోటీ చేస్తున్నారు. కేరళలో ఈ మూడు కూటములు బయటకు తీవ్రంగా పోరాడుతున్నట్టు కనిపిస్తున్నా లోపల మాత్రం పరస్పర ప్రయోజనాల కోసం ఒప్పందాలు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఓటర్లలో ఉత్కంఠ రేపుతున్నాయి. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) విషయం పరిశీలిస్తే 2025 నాటి లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తీరాలన్న ఆకాంక్షతో ఉంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు కార్పొరేషన్లను చేజిక్కించుకుంది. మలప్పురం వంటి బలమైన స్థానాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం కంటే ముస్లిం లీగ్ మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. 2021 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తరువాత యుడిఎఫ్ కొత్త వారికి, యువకులకు అభ్యర్థులుగా అవకాశం కల్పించింది. తెలంగాణలో విజయవంతమైన హామీల నమూనాను కేరళలో అమలు చేయించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. విద్యార్థులు, మహిళలు, యువతను ఆకర్షించేలా ఆరు గ్యారంటీలను ప్రకటించింది. చిన్న వ్యాపారుల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, రబ్బరు రైతులకు ప్రత్యేక మద్దతు ధర కిలోకు రూ. 250 వంతున కల్పన వంటి హామీలు ఇందులో ఉన్నాయి. అసోం అసెంబ్లీ ఎన్నికల గురించి పరిశీలిస్తే ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రెండోసారి తానే ముఖ్యమంత్రిగా రావాలని, ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి విజయం సాధించాలన్న ఆశతో ఉన్నారు. శర్మ హిందుత్వ వాదాన్ని బలపరుస్తూ ముస్లిం వ్యతిరేక వాదన తీవ్ర రూపంగా మారుస్తున్నారు. అంతేకాదు ద్వేష ప్రసంగాలు చేయడంలో ఆయన ఆరితేరారు. 2018 నాటి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనపై 40 కేసులు నమోదై ఉన్నాయని తేలింది. వీటిలో చాలా కేసులు ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించినవే. ఇక్కడ ముస్లిం చొరబాటుదారుల ఏరివేత. అభివృద్ధి ప్రాజెక్టులు, హిందుత్వ అతివాదం ఇవే ప్రధాన లక్షాలుగా బిజెపి పనిచేస్తోంది. గోహింస, లవ్ జీహాద్, మతమార్పిడి వంటివి ప్రధాన సమస్యలుగా పేర్కొంటోంది. అబద్ధం తెచ్చిన ఆర్థిక సంక్షోభం సంక్షేమ పథకాలకు సంబంధించి అరుణోదయ పథకం కింద 40 లక్షల మందికి నేరుగా నెలకు రూ. 1250 వంతున ఆర్థికసాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. రాష్ట్రం నుంచి చొరబాటుదార్లను తరిమికొట్టడం, అక్రమ ఆక్రమణలను నివారించడం తప్పనిసరి అంటున్నారు. ఇక కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని సిఎం తీవ్ర ఆరోపణలు చేయగా, దీనికి ప్రతిగా గొగోయ్ సిఎం శర్మ భార్యకు యుఎఇ, ఈజిప్టు, బర్బూర్ తదితర మూడు దేశాల పాస్ పోర్టులున్నాయని, ఓడిపోతే విదేశాలకు పారిపోడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపణలు సంచలనం కలిగిస్తున్నాయి. ఇక పుదుచ్చేరిలో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ నేత ఎన్ రంగస్వామి నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం 2021 నుంచి అధికారంలో ఉంది. ఇక్కడ ఉన్న నియోజకవర్గాలు కేవలం 30 మాత్రమే ఉన్నప్పటికీ పార్టీల రాజకీయాల కన్నా అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ట, ప్రజలతో మమేకం కావడం, సామాజిక సంబంధాలు తదితర అంశాలే విజయానికి కారణాలవుతాయి.

## నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

### కాల్పుల విరమణ.. రాజకీయ వైఫల్యం

### ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు

టెలిఅవీవ్,ఏప్రిల్9 : యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

## బహదూర్‌పల్లి గోదాంలో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు

మేడ్చెల్,ఏప్రిల్9 : మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

### పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన పల్లా

జనగామ,ఏప్రిల్9 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే కచ్చితంగా వారితో మాట్లాడి పరిష్కరిస్తానని స్పష్టం చేసారు. జనగామ నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## అజ్ఞాన హరణమే.. అంబర అపహరణం

శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలామృత సాగరం. ఈ లీలలన్నీ అప్రాకృతాలు– అభౌతికాలు, చిన్మయాలు. అధ్యాత్మ తత్త రహస్య భావనాగర్భితాలు. అనంత రస వర్షకాలు. అవి భౌతికాల వలె కనిపించినా చక్కగా విచారణ జరిపితే జీవుల భౌతిక– ప్రాపంచిక వాసనలను, జీవత్వాన్ని పూర్తిగా తొలగించి చిన్మయత్వాన్ని ప్రసాదిస్తాయి. జీవుల కర్మలు కర్తృత్వ బుద్ధి (అహంకారం)తోను, స్వార్థం (మమకారం)తోను కూడి ఉంటాయి. కనుక, అవి బంధకాలు– జన్మ సంసార బంధనాలు కలిగిస్తాయి. కాని, (జన్మకర్మ చ మే దివ్యం– గీత) దేవదేవుని కర్మలు దివ్యములు. కాన మోచకాలు– జీవుల బంధనాలు తొలగిస్తాయి. వీటికి 'లీలలు' అని పేరు. 'లయనం లాతి ఇతి లీలా'– మనస్సును లయింపజేసి ముక్తిని కలిగించేదే లీల. 'మనోనాశో మహోదయః'– మనస్సు నశించుటే మోక్షమని శాస్త్రం. అయితే, బాలకృష్ణుని లీలా విమర్శ చేసేటప్పుడు అతని నామ, రూప, గుణచేష్టలు ప్రాకృతాలు– పాంచభౌతికాలు కావు అన్న విషయం చాలా ముఖ్యం. 'న భూత సంఘ సంస్థానో దేవస్య పరమాత్మనః..' అని మహాభారతంలో వ్యాస వచనం. 'దామోదర భగవంతునిలో 'దేహము– దేహి' అన్న భేదం ఉండదు. ఆయన శరీరం పాంచ భౌతికం కాదు. అలా భూత సముదాయంగా భావించేవారు కర్మాధికారాన్ని కోల్పోతారు. అట్టివారి ముఖం చూసినా సచేల స్నానం చెయ్యాలి'. అంటే, అది అంతగా దోషావహమన్నమాట! భాగవతంలోని నవనీత చౌర్యం, చీర (వస్త్ర) హరణం, రాసలీల– ఇవన్నీ దివ్య చిన్మయి లీలలు. కాని, అధిక ఆక్షేపణకు, అపార్థాలకు గురైన ఘట్టాలు.



ఆధ్యాత్మికం

# రబీ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం

● తేమ వచ్చిన 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు ● అనధికార మిల్లర్లకు ధాన్యం పంపితే కఠిన చర్యలు ● హమాలి కార్మికులు, టార్పాలిన్ కవర్లు సమృద్ధిగా సిద్ధం చేయాలి ● చిన్న రైతులకు ప్రాధాన్యం ● వివక్ష లేకుండా కొనుగోలు జరగాలి ● ఆన్‌లైన్ నమోదు 24 గంటల్లో 100% పూర్తి చేయాలి ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు క కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100% ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరుకల కులస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## - తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో ఎనిమిది లక్షల జనాభా కలిగి ఉన్న ఎరుకల కులస్తుల కోసం ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నేరవేర్చకపోవడం భాదకరమని, వెంటనే వాటిని నెరవేర్చలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి అన్నారు. గురువారం రోజున పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి అధ్యక్షుతన నిర్వహించిన మీడియా సమావేశంలో కెమసారం తిరుపతి మాట్లాడుతూ ఎరుకల కులస్తులకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎరుకల కులస్తులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా అవకాశాలు దక్కలేదని, ఇప్పటివరకు అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములలో అక్కడక్కడ గ్రామీణ పారతాల్లోందులు పెంచుకోవడానికి షెడ్లు నిర్మించుకున్న ఎరుకల కులస్తుల పై అగ్రవర్గాలు దాడులు చేస్తున్నాయని అన్నారు. ఎరుకల కులస్తులపై మరోసారి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పందుల పెంపకందారులకు ప్రతి కుటుంబానికి 5ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఏకలవ్యకార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500కోట్ల బడ్జెట కేటాయించాలన్నారు. ఎరుకల సంస్కృతి ఐన తట్టల అల్లకము, నాంచారమ్మ సోది, నాంచారమ్మ జాతర, ఏకలవ్య జయంతి తదితర సంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా ఏడాదికోసారి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించలన్నారు. బల్దియాల్లో పందులను చంపి మా ఉపాధి దెబ్బతీస్తున్నారు కావున పందుల యజమానులకు కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం కోసం ప్రభుత్వమే శిక్షణ ఇప్పించి 100% సబ్సిడీతో పందుల ఫామ్స్ ఏర్పాటు చేయలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న మున్సిపాలిటి పరిధిలో నిర్మించియున్న షట్టర్లలో పంది మాంసం దుకాణం కోసం 10 షటర్లు కేటాయించాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రతి ఎరుకల కుటుంబానికి 10 లక్షల ఋణాలు ఇవ్వటంతో పాటు ప్రత్యేక ఎస్‌టీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, తిరుపులు సంపత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రేవెళ్ళి తిరుపతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఉండ్రాళ్ల ఎల్లర్యు, సార్ల తిరుపతి, లోకిని శారద, కర్ర రామమల్లమ్మ, మానుపాటి కనుకమ్మ, బిజిలి శ్రీనివాస్, అంజి, మాను పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ధీటుగా జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు

## - బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మెన్ కొండి సతీష్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారని పెద్దపల్లి బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మెన్ కొండి సతీష్ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా వైద్యవిభాగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న సందర్భంగా డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్‌ను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొండి సతీష్ మాట్లాడుతూ, పేద రోగులను దృష్టిలో ఉంచుకొని వారికి ఆర్థిక భారం లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారని జిల్లా ఆసుపత్రి వైద్యబృందాన్ని అభినందించారు. అన్ని విభాగాల్లో మెజర్ శస్త్రచికిత్సలు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తూ "వైద్యో నారాయణో హరి" అనే నానుడికి నిదర్శనంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ప్రతి రోజు 1000కు పైగా ఓపీ కేసులు, 200కు పైగా ఐపీ కేసులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సాధారణంగా హైదరాబాద్‌లో జరిగే శస్త్రచికిత్సలను సైతం జిల్లా కేంద్రంలోనే విజయవంతంగా నిర్వహించటం గొప్ప విషయమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఖర్చులు చేయకుండా, జిల్లా ఆసుపత్రిలోనే అనుభవజ్ఞులైన శిశు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నందున ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు అరగొండ రాజ్‌కుమార్, మిట్టపల్లి శ్రీను, గుమ్మడి ప్రసాద్, తిరుమలేష్, అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ... ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

**శంకరపట్నం, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూరు వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన మీస రవీందర్ (65),ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై మండలకేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్యే చెక్కుల పంపిణీకి హజరై తిరిగి ఇంటికి వెళ్ళే క్రమంలో మొలంగూరు అండర్ బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టింది. రవీందర్ అక్కడిక్కడే మృతి చెంది రాజిరెడ్డికి తీవ్రగాయాలుకాగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజిరెడ్డిని చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు బీఎస్పీ శంఖారావం....

## - ఈనెల 14న హనుమకొండలో బీఎస్పీ భారీ బహిరంగ సభ



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న హనుమకొండలోని కేడీసీ గ్రౌండ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల రాజనరసయ్య వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈసభకు సంబంధించిన గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇరుకుల్ల రాజనరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ జోన్ ఇంచార్జి వరికిల్ల మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు పెగ నరేష్, కాదాసి రవీందర్, మంథని నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ రవికుమార్, పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి మల్లారపు రవీందర్, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి జింక ఉదయ్, అధ్యక్షులు జనగామ లింగయ్య,ఎల్ల స్వామి, కార్పొరేషన్ అధ్యక్షులు బివిఎఫ్ విష్ణు, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# "కమలాపూర్ కుర్రాడి"గా ముద్దసాని అభివృద్ధి పునాదులు నిలిచే ఉంటాయి: నల్లగొండ తిరుపతి గౌడ్



**మానకొండూర్, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లిలో దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆవిష్కరించిన ముద్దసాని విగ్రహానికి గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్ పూలమాల వేసి నివాళు లర్పించారు .అనంతరం తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.... ముద్దసాని దామోదర్ రెడ్డి యువజన నాయకుడిగా ఎదుగుతూనే తన 29వ ఏట మొదటి సారి 1985లో టిడిపి నుండి కమలాపూర్ ఎమ్మెల్యేగా గెలిచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవడమే కాక ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో పలుశాఖల మంత్రిగా పనిచేసి రాష్ట్ర రాజకీయాల్లో కమలాపూర్ కుర్రాడిగా పిలువబడి జిల్లా రాజకీయాల్లో "కరీంనగర్ టైగర్" గా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. తెలంగాణ ఏర్పడే రేండేళ్ళ ముందు హుజురాబాద్ నియోజకవర్గానికి టిడిపి ఇంచార్జిగా ఉండి అనారోగ్యంతో మృతి చెందినప్పటికీ రాష్ట్రంలో దామోదర్ రెడ్డి వేసిన అభివృద్ధి పునాదులు శాశ్వతంగా నిలిచే ఉంటాయని తిరుపతి గౌడ్ కొనియాడారు.

# ఘనంగా ఎన్ఎస్‌యూఐ వ్యవస్థాపక దినోత్సవం

## - ఎం.డి. సుఫియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్9, (ది క్రైమ్ న్యూస్):** ఎన్ఎస్‌యూఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఎం.డి. సుఫియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. విద్యార్థులకు అవసరమైన విద్యా వనరులను అందించడం ద్వారా వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ కృపా సాగర్, యూత్ కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ ఉప్పరి విశాల్ విచ్చేశారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, యువత సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మణిదీప్, అబ్దుల్లా, ఫైజాన్, హిద్యాద్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. విద్య, యువత అభివృద్ధి పట్ల ఎన్ఎస్‌యూఐకి ఉన్న నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

# జాఫర్ ఖాన్ పేటలో ఘనంగా పోచమ్మ తల్లి మారు కొల్పు బోనాలు

## - అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్



**సుల్తానాబాద్, ఏప్రిల్ 09(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజక వర్గం కల్వశ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి మారు కొల్పు బోనాల జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి చల్లని దీవెనలతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి, ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామీణ సంస్కృతికి ప్రతీకలైన ఇటువంటి జాతరలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంగ గట్టయ్య, ఒరుపుల శ్రీనివాస్, మేడి సారయ్య, పురేళ్ళ దిలిప్, తిప్పని నరేష్, చొప్పరీ కుమార్, నెట్టేట్ల శ్రీనివాస్, మావురం కరుణాకర్, గడ్డం అనీల్ కుమార్, ఓర్పుల రాజేష్, అసంశెట్టి రాజుకుమార్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 7వ వార్డులో హెల్త్ క్యాంప్

## - మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్



**సుల్తానాబాద్, ఏప్రిల్ 09 (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 యాక్షన్ ప్లాన్) లో భాగంగా సుల్తానాబాద్ లో గురువారం రోజున 7వ వార్డులోని పల్లె దావఖానలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం పల్లె దావఖానల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన చికిత్స అందించడంలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్ పి వి టీకా ఎంతో కీలకమని, 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు ఈ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధుజ, ఏఎన్ఎంలు ఎ ఎన్ ఎం ఆశ వర్కర్లు, ఆర్పీలు పల్లె దావఖాన సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పేదల కోసం పరితపించిన ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం

● వచ్చే వర్ధంతి వరకు జమ్మికుంటలో మరో విగ్రహం ● ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు

**మానకొండూర్, ఏప్రిల్ 9, (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం సదాశివపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని గురువారం ముద్దసాని వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. అనంతరం అలుగునూరు శ్రీ లక్ష్మీ నరసింహ కన్వెన్షన్ లో ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్దసాని వర్ధంతి సభలో చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ..ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నాయకత్వం వహించి ఎంతోమందిని నాయకులుగా తీర్చిదిద్దడంతో పాటు మాజీ మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యే రాం రెడ్డి లను ఎమ్మెల్యేలను చేసిన ఘనత దామోదర్ రెడ్డికే దక్కుతుందన్నారు.ముద్దసాని వల్లే ఈ స్థాయికి వచ్చానని,ఎవరితో ఎలా ఉండాలో ఎలా పనులు చేయించాలో దామోదర్ రెడ్డిని చూసి నేర్చుకున్నానని తెలిపారు.1994 ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు.నిరంతరం రైతులకోసం పరితపిస్తూ కమలాపూర్ నియోజకవర్గంలో ఒక్క మడి కూడా ఎండకుండా కాలువ ద్వారా నిరంతరం నీళ్లు పారించిన ఘనత ముద్దసానికే దక్కిందన్నారు. నాడు గ్రామాల్లో నక్సలైట్ల ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో చాలామంది యువకులు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి నెలకొనగా ఎన్కౌంటర్ల పాలు కాకుండా తనను నమ్ముకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు కాపాడుకుని ప్రజలకు న్యాయం చేశారని అన్నారు.ఒక్క పిలుపిస్తే పదివేల మంది కార్యకర్తలు ఒకే చోటికి చేరేలా కమలాపూర్ నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా తయారు చేశారని, నేటికీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలవలేదన్నారు. రెండు దశాబ్దాల పాటు వరుస విజయాలతో దూసుకుపోయి 2004 ఎన్నికల్లో అనారోగ్య కారణాలతో ఓటమి చెందినా దామోదర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వచ్చే వర్ధంతి వరకు జమ్మికుంటలో ముద్దసాని విగ్రహాన్ని ఏర్పాటు చేసి భారీ సభను నిర్వహిస్తామని, ముద్దసాని ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని విజయ రమణారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ... రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా మంత్రిగా పని చేసిన ముద్దసానిది తమ పక్క ఊరే కావడంతో ఏ పనికోసం వెళ్లినా ముద్దసాని కాదనకుండా చేశారని గుర్తు చేశారు. దేవాలయాల్లోకి దళితులను రానివ్వని రోజుల్లో ఇల్లందకుంట దేవస్థానానికి దళితుడిని చైర్మన్ చేసిన ఘనత దామోదర్ రెడ్డికే దక్కుతుందని, తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా ఒక దళితురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారన్నారు. దామోదర్ రెడ్డి నాయకత్వం ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలవగా పలువురు ఎమ్మెల్యేలుగా, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారన్నారు. ముద్దసాని విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో విజయ రమణారావు కృషి మరువలేనిదని, ముద్దసాని ఆశయ సాధనకై పాటుపడతామని స్పష్టం






చేస్తూ ఉమ్మడి జిల్లాను శాసించిన ఏకైక నాయకుడు దామోదర్ రెడ్డికి కృతజ్ఞతగా సదాశివపల్లిలో విగ్రహాన్ని నెలకొల్పినట్లు కవ్వంపల్లి తెలిపారు.కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కె శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ ఆకుల నందిని, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు,సత్తు మల్లేశం, అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,రామగుండం డిప్యూటీ మేయర్ పాతుపల్లి ఎల్లయ్య, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వోడితెల ప్రణవ్ బాబు, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తం రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొత్తూరి జగన్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు,బండారి రమేష్ గౌడ్, నందగిరి రవింద్ర చారి, ఊకంటి మధుకర్, గోపు మల్లారెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, వివిధ ప్రాంతాల ముద్దసాని అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు.

# ఖనిలో ఘనంగా జరిగిన 56వ ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వేంకట స్వామి ఆదేశాల మేరకు గురువారం రోజు 56 వ ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా నాయకులు బైరిమల్లా దుర్గాప్రసాద్, మేంటం ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో ఖని రీగల్ షా మార్ట్ దగర ఎన్ ఎస్ యు ఐ జెండా ఆవిష్కరణ అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ ఎన్ ఎస్ యు ఐసీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి హాజరై ఎన్ ఎస్ యు ఐజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ నాయకులు మెంటం ఉదయ్ రాజ్ మాట్లాడుతూ భారత దేశానికి బలమైన నాయకత్వం అందించిన స్వర్గీయ ఇందిరా గాంధి ఈ దేశ రాజకీయలోకి చదువుకున్న విద్యార్థులు,యువత రావాలనే ఆకాంక్షతో 1971 ఏప్రిల్ 9 నా ఎన్ ఎస్ యు ఐ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ) కాంగ్రెస్ పార్టీ కి అనుబంధ సంస్థగా ఆవిర్భవించారు అని ఈ దేశ అభివృద్ధిలో భాగంగా విద్యా రంగానికి పెద్దపీట వేసి, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచేవిధంగా ఐఐటి, నీట్, ఏఐఎంఎస్, జేఎన్టీయూ వంటి ప్రతిష్టాత్మకమైన విద్యా వేవస్థలను స్థాపించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా విద్యార్థుల మేలుకై అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అందులో భాగంగా గురుకుల విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జెస్ పెంపు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్, పెండింగ్ స్కాలర్షిప్ బకాయిలను దఫాల వారిగా విడుదల చేయడం ,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ , విశ్వ విద్యాలయాలకు నిధులు, ప్రైవేట్ స్కూల్ కాలేజీల ఫీజులా నియంత్రణకు ప్రభుత్వ చర్యలు, రాష్ట్ర బడ్జెట్ లో గతం లో లేని విధంగా విద్యా శాఖ కి నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని అన్నారు. రామగుండం నియోజికవర్గంలో కూడా పేద,సామాన్య మధ్యతరగతి కుటుంబాల పిల్లల భవిషత్తు అత్భుతంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కలిపిస్తూ, ప్రత్యేకంగా కొన్ని కోట్ల రూపాయలతో



రామగుండం జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల నిర్మించడం, గోదావరిఖని ప్రభుత్వ పాఠశాల, కళాశాల (ఇంటర్మీడియట్) విద్యార్థుల కోసం సుమారు 7 కోట్ల రూపాయలతో నూతన పాఠశాల, కళాశాల నిర్మాణం చేపట్టడం, ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంసీఏ వంటి కోర్సులను పున: ప్రారంభించడానికి కృషి చేస్తున్న ఘనత మన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దని గుర్తుచేశారు. విద్యకు ఇంతటి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వం బలోపేతానికి జిల్లా విద్యార్థులంతా రానునంటువంటి రోజులో ఎన్ ఎస్ యు ఐ నాయకులతో కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం తోడు కావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ అధ్యక్షులు తిపారపు శ్రీనివాస్, ఎన్ ఎస్ యు ఐ సీనియర్ నాయకులు ఎండి యాకుబ్ , కార్పొరేటర్లు ఎండి ముస్తఫా, గట్ల రమేష్, ధూళికట్ట సతీష్ ,సీనియర్ నాయకులు సింహాచలం,యాద వెంకట రమణ ,పూసల శ్రీనివాస్, అరుణ్,శాంతి ఎన్ ఎస్ యు ఐ నాయకులు దుర్గా, ఉదయ్ రాజ్, ప్రశాంత, శ్రవణ్, కేశవ్, ప్రవీణ్, వాసు, జోన్స్, రిక్కీ, జాయ్, చరణ్, దినేష్, శ్రీమాన్ బాబు, రోహిత్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలచే వేసవిలో జాగ్రత్తగా పని చేయించండి

**- వేసవి తాపం నుండి ఉపశమనం కొరకు షెడ్ నెట్తో గుడిసెలు వేయాలి - చల్లటి నీరు, మజ్జిగ సరఫరా చేయించాలి - ఏ.పి.డి. కొమ్మెర సత్యనారాయణ**

**రామగిరి,ఏప్రిల్ 09(ది క్రైమ్ న్యూస్):-** ఉపాధి కూలీల చే వేసవి లో జాగ్రత్త గా పని చేయించాలని ఉపాధి హామీ పథకం ఏ.పీ.డీ కొమ్మెర సత్యనారాయణ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో రామగిరి ఖిల్లా లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఎండ వేడిమి తగలకుండా ఉదయం 7 గంటల నుండి 11 గంటల లోపు పనులు పూర్తి చేయించాలని, రెండు సార్లు ఎన్.ఏం.ఏం.ఎస్ లో ఆన్ లైన్ ఫోటో దిగాలని కోరారు. రూ. 272 కూలీని రూ. 307 కు పెంచడం జరిగిందని తెలిపారు. 40 మంది కూలీలకు ఒక్క మేట్ ను నియమిస్తామని తెలిపారు. వేసవి తాపం నుండి ఉపశమనం కొరకు షెడ్ నెట్ తో గుడిసెలు వేయాలని, చల్లటి నీరు, మజ్జిగ సరఫరా చేయించాలని సూచించారు. ఓ.ఎస్.ఆర్. పాకెట్ లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వి.బి.జి. రాం జి పథకం గా పేరు నెల రోజుల లో మారుతుందని తెలిపారు. దీనికి అనుకూలం గా పని చేయవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా లో 3 లక్షల మంది వరకు ఉపాధి కూలీలు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. ఐరిస్, ఈకేవైసి ఇబ్బందులు వచ్చిన కూలి లతో



మాట్లాడి వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీడీని సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీ రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీ రావు, టెక్నికల్ అసిస్టెంట్ లు మల్కా అఖిల, లింగాల సుప్రియ, సెక్రటరీ గంగుల సంతోష్, డి.ఆర్.పి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ లు సందేవేన జ్యోతికుమార్ పాల్గొన్నారు.

# ఆనిశాకు చిక్కిన అంతర్గాం ఆర్ఐ....

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల తహసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) శ్రీమాన్ పదివేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. మండలంలోని రాయదండి గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి భూమి ఎంక్వైరీ కి సంబంధించి 10,000 లంచం డిమాండ్ చేయడంతో సదరు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రైతు వెంకటస్వామి తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ శ్రీమాన్ కు లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే కేసు నమోదు చేసుకుని, ఐదు గంటల పాటు విచారణ చేశారు. అనంతరం ఆర్ ఐ శ్రీమాన్ ను అదుపులోకి తీసుకొని కరీంనగర్ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామన్నారు.



# 2వ వార్డులో సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు

## పరిశుభ్రత కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నపూర్ణ సైదులు

**నల్గొండ జిల్లా ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్): ఏప్రిల్ 09** నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని హాలియా మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డులో సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని 2వ వార్డ్ కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ సైదులు తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డ్ పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన ఉన్న చెట్లు, చెత్తాచెదారం, అలాగే మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను స్వయంగా పర్యవేక్షిస్తూ శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మైను, సాజిద్, వార్డు ప్రజలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. వార్డ్ అభివృద్ధి మరియు పరిశుభ్రతకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కౌన్సిలర్ పేర్కొన్నారు.



# పాడి గేదెల పెంపకం పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

**- కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వార్షిక ప్రణాళిక 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకానికి సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 16 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వహక సంచాలకులు జి.శ్రావణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఆన్లైన్లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత మున్సిపల్ , మండల పరిషత్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), పాస్పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అదేవిధంగా, పాడి గేదెల పథకం కోసం కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు.కావున ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 16లోపు వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వహక సంచాలకులు ప్రకటనలో తెలిపారు.

# రామగుండం లో బి.ఎల్.ఓ లు గా రాజీనామా చేసిన 114 మంది ఆర్పీలు

**- బి.ఎల్.ఓ లుగా దూర ప్రాంతాలకు పంపడం ద్వారా ఆర్పీ లపై ఆర్థిక భారం**



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నియోజకవర్గం లో బూతు లెవెల్ అధికారులుగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్పీలు 2016 నుంచి వారికి అనుకూలమైన ప్రాంతంలో పని చేస్తున్న వారిని రెవెన్యూ అధికారులు కొంతమంది ఆర్పీలను దగ్గరి ప్రాంతం నుండి దూర ప్రాంతాలకు పంపడం వల్ల ఆర్పీ లపై ఆర్థిక భారం పడుతుంది. ఆర్పీ లు ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు చెందిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఇప్పించేందుకు తమ విధులను నిర్వర్తించడం జరుగుతుంది. ఇది కాకుండా అదనంగా ఆర్పీ లు బి.ఎల్.ఓ విధులు కూడా ఎలాంటి బెనిఫిట్ లేకుండా అదనంగా చేయడం జరుగుతుంది. ఆర్పీ లు స్వంతం గా డబ్బులు పెట్టుకుని రవాణా భారాన్ని మోయడం వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారు, ఎందుకంటే ఆర్పీలకు గౌరవ వేతనం కూడా 6 వేలు మాత్రమే ఇస్తారు, అదనంగా బి.ఎల్.ఓ లు గా పని చేస్తున్న ఆర్పీ లకు ప్రభుత్వం ఎలాంటి రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. కనుక దూర ప్రాంతాల కు బి.ఎల్.ఓ లు గా ఆర్పీలు వెళ్ళేందుకు సుముఖంగా లేరు, కొంత మంది అధికారులు ఆర్పీ లను దూర ప్రాంతాలకు వెళ్ళాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నందున 114 మంది ఆర్పీ లు బి.ఎల్.ఓ లు గా విధులు నిర్వహించలేమని పేర్కొంటూ రాజీనామా చేయడం జరిగిందని, కనుక జిల్లా కలెక్టర్ స్పందించి దూర ప్రాంతాలకు బి.ఎల్.ఓ లు గా ఆర్పీలను పంపకుండా దగ్గర ఉన్న ప్రాంతాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్పీ లు కోరుతున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే చట్టరీత్యా చర్యలు

**- రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేశ్వరరావు**

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిన 5 మందిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు గురువారం ప్రవేశపెట్టారు. ఇందులో ముగ్గురికి 6000 రూపాయల జరిమానా పడగా, గతంలోనే ఒకసారి పట్టుబడి మళ్ళీ మద్యం తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తికి 05 రోజుల జైలు శిక్ష విధించారని సీఐ బి. రాజేశ్వరరావు తెలిపారు. శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఐ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. సరైన పత్రాలు లేకుండా లేదా మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షలు తప్పవని సీఐ బి. రాజేశ్వరరావు తెలియజేశారు.



# క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్‌వాడీ టీచర్ సస్పెండ్

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగ్ల మల్యాల స్వర్ణలత, తనపై అధికారుల పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడినట్లు ఫిర్యాదులు అందాయని ఈ ప్రవర్తన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యమని ప్రాథమిక విచారణలో తేలిందని, ?ఉన్నతాధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి సదరు అంగన్‌వాడీ టీచర్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ సస్పెన్షన్ ఆదేశాలు సదరు టీచర్‌పై పూర్తిస్థాయి విచారణ పూర్తయ్యి, తదుపరి చర్యలు తీసుకునేంత వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, క్రమశిక్షణ తప్పినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు..



# అక్రమ ఇసుక రవాణాను అరికట్టండి..



**జమ్మికుంట ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మానేరు వాగు పరివాహక ప్రాంతం నుండి విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టు ఉదాసీన వైఖరి ప్రదర్శించడం పట్ల స్థానికంగా ఉన్న గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జమ్మికుంట మండల పరివాహక ప్రాంతంలో ఉన్న మానేరు వాగు నుండి వందలాది డాక్టర్ల ద్వారా విలాసాగర్ కొండపాక గ్రామాలకు చెందిన అక్రమ ఇసుక రవాణా దారులు రాత్రి పగలు తేడా లేకుండా యదేచ్ఛగా దందా కొనసాగిస్తున్న పట్టించుకునే అధికారులు లేకపోవడంతో మూడు పువ్వులు ఆరు కాయలు అనే విధంగా ఇసుక వ్యాపారం కొనసాగుతుంది. అక్రమ ఇసుక రవాణా చేయకుండా కోరపల్లి గ్రామ శివారు తో పాటు నాగంపేట గ్రామాలలో చెక్పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ చెక్పోస్టులలో విధులు నిర్వహించే కొంతమంది పోలీసులు ఇసుక రవాణా దారుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికంగా ఉన్న గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెక్పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ రాత్రివేళ తెల్లవారుజామున పదుల సంఖ్యలో ట్రాక్టర్లు రావడంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఇసుక రవాణా దారులు చెక్పోస్టులు ఏర్పాటు చేయడంతో కోరపల్లి గ్రామ శివారులో గల నాగులకుంట ద్వారా వెంకటేశ్వర పల్లి మీదుగా ఇసుక రవాణా చేస్తూ ఉండడం వలన కట్ట పూర్తిగా ధ్వంసం అయిపోయిందని రానున్న వర్షాకాలంలో నేను ఎక్కువగా వచ్చినట్టయితే గ్రామంలో ఉన్న ఇండ్లలోకి నీరు వస్తుందని వెంకటేశ్వర పల్లి గ్రామస్తులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరి కానిస్టేబుల్ లను అక్రమ ఇసుక రవాణా దారులకు సహకరిస్తున్నారనే ఉద్దేశంతో కరీంనగర్ సిపి గౌస్ అలాం వారికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ ఇసుక రవాణా దారులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. మరో అడుగు ముందుకేసి ఇందిరమ్మ ఇండ్ల టోకెన్లను సైతం డూప్లికేట్ గా ముద్రించి వాటిని సైతం వారి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వెంకటేశ్వర పల్లి గ్రామస్తులందరూ తమ గ్రామం గుండా ఇసుక రవాణా కొనసాగడం వల్ల తమ రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక సీఐ రామకృష్ణ గౌడ్ వివరణ కోరగా రాత్రివేళల ఇసుక రవాణా జరగకుండా బ్లూ కోర్టు టీమును ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా చెక్పోస్ట్ ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# హుజురాబాద్ నియోజకవర్గం నాకు అత్యంత ముఖ్యమైనది..

## ● సామాజికవేత్త సబ్బని వెంకట్..



**హుజురాబాద్ ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ అనేది విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతం. గత 40 సంవత్సరాలుగా ఇక్కడ వ్యవసాయం , మౌళిక సదుపాయాల మీద పెట్టిన దృష్టి , అభివృద్ధి మీద పెట్టలేదు. ఈ ప్రాంతానికి గౌరవంగా చెప్పుకునే ఒక మంచి కాలేజీ, ఒక పెద్ద కంపెనీ, లేదా ఉపాధి కల్పించే ఫ్యాక్టరీ కూడా తీసుకురావడానికి నాయకులు నిజమైన కృషి చేయలేదు. ఫలితంగా, హుజురాబాద్ యువతకు అవకాశాలు లేక, అభివృద్ధి మార్గాలు మూసుకుపోయాయి.ఇక్కడి పిల్లలు ఎంతో కష్టపడి ఉన్నత విద్యలు పూర్తి చేసినా, సరైన ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారు. సమాజంలో అవమానాలు ఎదుర్కొంటూ, దొరికిన చిన్నపాటి పనులు చేస్తూ లేదా ఇంటికే పరిమితమైపోతున్నారు. చాలామంది తమ కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యవసాయం లేదా చిన్నచిన్న వ్యాపారాల మీద ఆధారపడి కాలం గడుపుతున్నారు. ఇది ఒక ప్రాంత అభివృద్ధి లోపానికి స్పష్టమైన ఉదాహరణ. అలాంటి పరిస్థితుల్లో ఉన్న ఈ చిన్న చిన్న బ్రతుకులను కూడా ఇప్పుడు డంపింగ్ యార్డ్ మరియు వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ వల్ల నాశనం చేసే పరిస్థితి తీసుకురావడం చాలా బాధాకరం. రాజకీయాలను వ్యాపారంగా మలుచుకున్న వారు ఈ విషయాన్ని పట్టించుకోకపోవచ్చు, కానీ నాకు నా ఊరు హుజురాబాద్ నియోజకవర్గం – అత్యంత ముఖ్యమైనది. ఇన్నాళ్లుగా నేను ఈ ప్రాంత సమస్యలను గుర్తించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రజల ప్రతినిధులుగా చెప్పుకునే నాయకులను ప్రశ్నిస్తూ వచ్చాను. "నా ఉద్దేశం ఒకటే ఒక రోజు నాయకులు ఈ సమస్యలను పరిష్కరిస్తారు, లేకపోతే ప్రజలు వారిని ప్రశ్నించే స్థాయికి చేరుకుంటారు. కానీ, నేను ఆశించిన స్థాయిలో నా ఆలోచన సఫలీకృతం కాలేదు." ఇప్పుడు డంపింగ్ యార్డ్ వంటి ప్రాజెక్ట్ వల్ల మన గ్రామాల మనుగడ ప్రశ్నార్థకంగా చేరే పరిస్థితి ఏర్పడింది.ఈ సమస్యపై ప్రజల్లో పూర్తి అవగాహన, భావోద్వేగం పెరిగినప్పటికీ, రాజకీయ నాయకులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధ కలిగిస్తోంది. ఇంత తీవ్రమైన సమస్యను కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నించడం చూస్తే ఇక మౌనం వహించడం సరికాదు అనిపిస్తోంది. పైన పేర్కొన్న ప్రతి అంశం , ప్రతి సమాచారం మీకు తెలియ చేయాలనేది నా ఆలోచన, హుజూరాబాద్‌లోని డంపింగ్ యార్డ్ నేల, నీటిని కలుషితం చేసి, రైతుల ఆదాయాలను తగ్గించడం ద్వారా వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. భూగర్భ జల కాలుష్యం వల్ల తాగునీరు అసురక్షితంగా మారి, ఆరోగ్య సమస్యలు పెరగవచ్చు. ఆస్తుల విలువలు పడిపోయి, ప్రజలు సమీప నగరాలకు వలస వెళ్ళేలా చేయవచ్చు. కాలక్రమేణా, ఇది ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచి, నియోజకవర్గం యొక్క సమగ్ర అభివృద్ధిని మందగింపజేస్తుంది. హుజురాబాద్ రాజకీయంగా వాడుకోబడ్డ, అభివృద్ధి, ఉపాధి పరంగా నిర్లక్ష్యం చేయబడిన ప్రాంతం, ఇప్పుడు ఈ డంపింగ్ యార్డ్ వల్ల , ప్రజల జీవితాలు ఛిద్రం అవుతాయి. ఇప్పుడు హుజురాబాద్‌లో రోజుకు కేవలం 20 టన్నుల కంటే తక్కువ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి, కాబట్టి దాదాపు 95% వ్యర్థాలు ఇతర ప్రాంతాల నుంచే వస్తుండాలి. ఏ ప్రభుత్వమైన కేవలం రవాణా , నీరు , రోడ్డు సదుపాయాలు ఉన్నాయి కదా అని 3% చెత్త వచ్చే ప్రాంతానికి 97% చెత్తను తరలిస్తారా ? ఇది పూర్తిగా గత ప్రభుత్వం లోని అధికారుల అనాలోచిత నిర్ణయం , దయచేసి మీరు ఒకసారి పరిశీలించండి అవసరమైతే, నా ప్రాంత ప్రయోజనాల కోసం నేను కూడా మీ అధికారులతో కలిసి పని చేస్తాను. మా ప్రజల ఆవేదనను వారి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాజెక్ట్ హుజురాబాద్ నుండి జనావాసాలకు , పంటపొలాలకు ఇబ్బంది కలగకుండా, వేరే ప్రాంతానికి తరలించేలా చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నాను పైన పేర్కొన్న ఆందోళనల దృష్ట్యా, మేము అధికారులను ఈ క్రింది విధంగా వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాము: ప్రతిపాదిత హుజూరాబాద్ ప్రదేశంలో డంపింగ్ యార్డ్, డబ్ల్యూ టి ఈ ప్లాంట్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలి. ఇందులో ఉన్న తీవ్రమైన ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత ప్రతిపాదనను రద్దు చేయాలి. పూర్తి పారదర్శకత మరియు ప్రజా భాగస్వామ్యంతో సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనా ( ఈ ఐ ఏ) నిర్వహించాలి. నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములు మరియు నీటి వనరులకు దూరంగా ఉన్న ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలి. పర్యావరణ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించేలా చూడాలి మరియు ప్రజారోగ్యం, జీవనోపాధిని కాపాడాలి. హుజూరాబాద్ ప్రజలు ఈ ప్రాజెక్టును దాని ప్రస్తుత రూపంలో, ప్రదేశంలో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ సుస్థిరత మరియు భవిష్యత్ తరాల శ్రేయస్సుకు నష్టం కలిగించేలా అభివృద్ధి జరగకూడదు. 2023 లోనే హుజురాబాద్ లో ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదించి అన్ని శాఖల క్లియరెన్సులు పొందింది . తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హుజురాబాద్ ప్రజల అభీష్టాన్ని , అభిప్రాయాన్ని అసెంబ్లీ వేదికగా మా స్థానిక నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి, సీఎం గారు, సంబంధిత శాఖా మంత్రుల దృష్టికి తీసుకుపోలేక పోయింది. కానీ నేను మొదటి నుండి ఆ ప్రాంత అభివృద్ధి మీద దృష్టి కేంద్రీకరించి, మా ప్రాంతంలో ఉన్న అసమర్ధ రాజకీయాలను ప్రశ్నిస్తూ, ఇక్కడ జరిగే అనభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ వస్తున్నాను, దానిలో భాగంగా నాకు ఈ ప్రాజెక్ట్ గురించి జూన్ 2025 లో తెలియగానే నేను అక్కడ ఉన్న ప్రజలలో సామాజిక స్పృహ ఉన్నవారిని, ప్రజా సంఘాలను, విద్యార్థి సంఘాలను, ఏకం చేసి పార్టీలకతీతంగా అఖిలపక్షం ఏర్పాటు చేసి గత 15 రోజులుగా ప్రజా నిరసన దీక్షలను నిర్వహిస్తున్నాం మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు, గత ప్రభుత్వం అనాలోచిత చర్యను మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. గత ప్రభుత్వం ప్రజా సేకరణ చేయకుండా చేసిన తప్పిదం ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తే మా ప్రాంత పిల్లల భవిష్యత్తును 30-40 సంవత్సరాలు వెనక్కు నెట్టేస్తుంది. కావున, ప్రాజెక్ట్ హుజురాబాద్ నుండి వేరే చోటకి జనావాసాలు, పంట పొలాలు లేని చోటికి తరలించాలని హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలపక్షాన ప్రభుత్వ సలహాదారుడ్ను వేం నరేందర్ రెడ్డి కి విన్నవించారు.

# దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

● దామోదర్ రెడ్డి విగ్రహన్ని ఏర్పాటు చేస్తాం ● అనేక మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడు ● హుజూరాబాద్,పాత కమలాపూర్ నుండి భారీగా తరలివచ్చిన అభిమానులు ● జోహార్ దామన్న నినాదాలతో మారుమ్రోగిన సభా ప్రాంగణం ● దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్..




**హుజూరాబాద్ ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం పనిచేసి కరీంనగర్ జిల్లా టైగర్‌గా, నమ్మకానికి, విశ్వసనీయతకు మారు పేరు తెచ్చుకున్న మహా నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో ఆయన 14వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి గురించి జిల్లాలో తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదని, వ్యక్తిగతంగా మా కుటుంబానికి, మా తాత వొడితల రాజేశ్వర్ రావు కు చాలా దగ్గరి వ్యక్తి అని, వారి నుండి మాలాంటి యువతర నాయకులం నేర్చుకోవాల్సింది చాలా ఉందని, వారి ఆశయాలకు అణుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని, హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రణవ్ తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో పెద్దపల్లి శాసన సభ్యుడు విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలో దామోదర్ రెడ్డికి అభిమానులు ఉండేవారని, వారి తర్వాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే నాయకుడిగా వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్, దామోదర్ రెడ్డి అభిమానులు భారీగా పాల్గొన్నారు.



## డ్రైన్ ఎండ్ సోక్ ఫిట్‌లోకి మురికి నీరు విడుదల





**రామగిరి, ఏప్రిల్ 09(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ పరిధి రాంనగర్ లోని డ్రైన్ ఎండ్ సోక్ ఫిట్ లోకి గురువారం మురికి నీరు విడుదల చేశారు. సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీ రావు ఆధ్వర్యం లో సోక్ ఫిట్ నిర్మాణం జరిగింది. మురికి నీరు తో ఇబ్బంది అవుతుందని స్థానికుల ఫిర్యాద్ మేరకు సోక్ ఫిట్ నిర్మాణం చేశారు. మురికి కాలువలో భారీగా ఆగిన మురికి నీరు సోక్ ఫిట్ లోకి చేరడం తో తాత్కాలికంగా ఇబ్బందులు తగ్గుతాయని సర్పంచ్ పల్లె ప్రతిమ- పివి రావు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నం మణి తేజ, సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపల్లిలో మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్9(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా సదాశివపల్లి గ్రామంలో మాజీ మంత్రి స్వర్గీయ ముద్దసాని దామోదర్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర ముఖ్య నాయకులు, చింతకుంట విజయ రమణా రావు పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ ఎమ్మెల్యే, గంగుల కమలాకర్ కరీంనగర్ ఎమ్మెల్యే, కొలగాని శ్రీనివాస్ కరీంనగర్ నగర మేయర్,సత్తు మల్లేష్ కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, అన్నయ్య గౌడ్ పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వొడితేల ప్రణవ్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్, ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాలి




**జమ్మికుంట ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి (టి.జె.ఎస్) పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అరికిల్ల భానుచందర్, పార్టీ మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతి వేడుకలు సరైన ఉత్సవ కమిటీ లేకుండా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ గారు దేశానికి చేసిన సేవలు అపారమని, అలాంటి మహనీయుని జయంతి వేడుకలను గౌరవప్రదంగా, ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో సమగ్రంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సీసీ కెమెరాలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ ...

## ● హెల్మెట్లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన ఎస్పీ..







**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు కలిసి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ప్రకారం గ్రామంలో 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సీసీ కెమెరాలను గురువారం జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామాలలో రోడ్డు భద్రత పెంపొందించడం, నేరాలను నివారించడం, అలాగే గంజాయి నిర్మూలనలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలకు మద్దతుగా కొత్తపేట గ్రామం ముందడుగు వేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అనే నియమాన్ని అమలు చేయడం, గ్రామాన్ని పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచడం వంటి ముఖ్య నిర్ణయాలను గ్రామ సభ ద్వారా తీసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ బయ్యారం సీఐ రవీందర్, ఎస్ఐ తిరుపతి, గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ మరియు గ్రామ ప్రజలతో కలిసి సమ్మక్క-సారక్క దేవాలయం నుండి కొత్తపేట గ్రామపంచాయతీ కార్యాలయం వరకు హెల్మెట్లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ కి ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడేలా చర్యలు తీసుకుంటామని, గంజాయి నిర్మూలనలో తమ వంతు పాత్ర పోషిస్తూ యువతను మంచి మార్గంలో నడిపించేలా కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన ఈ ఉద్యమానికి గ్రామ ప్రజలంతా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలో 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. అనంతరం ఎల్ఈడి స్క్రీన్ ద్వారా హెల్మెట్ వినియోగం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలను ప్రదర్శించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ముఖ్యంగా యువతపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, కొత్తపేట గ్రామంలో 24 సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అభినందనీయమని తెలిపారు. గ్రామ సర్పంచ్ ప్రవీణ్ గారిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ ప్రజలు హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష....

## ● వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి .. ● ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి ● వసూళ్లకు పాల్పడితే క్షమించేది లేదు .. ● జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్..





**మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి ఏప్రిల్.09(ది క్రైమ్ న్యూస్):** జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, పంచాయతీ అధికారులతో కలిసి గురువారం జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుండి స్పెషల్ డ్రైవ్ చేసిన దానిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. నీటి సరఫరా సమస్య ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలలో, హ్యాబిటేషన్ లలో సరఫరా చేసేటువంటి నీరు నాణ్యతను పరిశీలించాలని అన్నారు. యాక్షన్ ప్లాన్ తయారు చేసి, గ్రామాల వారీగా ఏప్రిల్ 23 తరువాత ప్రతి పాఠశాలలోని నీటి ట్యాంకులను శుభ్రపరచాలని అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పైప్ లైన్ లీకేజీ ఏమన్నా ఉంటే వాటిని సరి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జిల్లాలో 4205 ఇందిరమ్మ ఇండ్లకు గాను సుమారు 795 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, గ్రామాలలో, మున్సిపల్ ప్రాంతాల్లో పూర్తి కాని ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విసిట్ చేసి లబ్ధిదారులతో మాట్లాడాలని మార్కింగ్, బేస్ మెంట్ లెవల్, స్లాబ్ లెవల్ నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని, ఎవరైతే ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయి నిర్మాణానికి ఆసక్తి లేని వారి పేర్లలో వేరే లబ్ధిదారులను చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏ గ్రామంలోనైతే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు లబ్ధిదారుల ఎంపికకు ఆ గ్రామ కమిటీ ఆసక్తి గా లేకపోతే కొత్త కమిటీ ప్రతిపాదనలకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్ద ఉద్యోగులు ఏ విషయంలో నైనా డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే క్షమించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులు కృష్ణారెడ్డి,, ఎం.పి.డి.ఓ లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు...

## ● గంజాయి సమాచారం ఇస్తే 5,000 బహుమతి ... ● జిల్లా ఎస్పీ డా. శబరీష్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):-** మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత మరియు భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం మరియు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్య. ఇది నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుంది మరియు వ్యక్తులను నేరాల వైపు నడిపిస్తుంది. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటి.గంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఉరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజాయి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు. అందువల్ల మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోంది. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి ?5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుంది. సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ప్రజలు తమ సమాచారం ఈ ప్రత్యేక మొబైల్ నంబర్ ద్వారా అందించవచ్చు. 8712656999 మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పును తీసుకురాగలదు. మన యువతను కలిసి మహబూబాబాద్ జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా కాపాడుకుందాం మార్చుకుందాం.

# కరీంనగర్‌లో ఘనంగా 'ఎస్ వి కిచెన్స్' బిర్యానీ సెంటర్ ప్రారంభం



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని శివ థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్ వి కిచెన్స్ 'బిర్యానీ సెంటర్ను గురువారం పలువురు ప్రముఖులు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్. సునీల్ రావు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, చల్ల స్వరూప రాణి-హరిశంకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి హోటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, నగర ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఇలాంటి మరిన్ని సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా 'ఎస్ వి కిచెన్స్' నాణ్యతను పాటించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ దేశ శిల్ప వేదం, 50వ డివిజన్ కార్పొరేటర్ బి. ప్రవీణ్ రావు, 62వ డివిజన్ కార్పొరేటర్ భార శ్రీలేఖ-జితేందర్, హోటల్ నిర్వాహకులు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఏదైనా కళాశాలకు "ముద్దసాని" పేరు పెట్టాలి: పూసాల సంపత్



**మానకొండూర్, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లిలో గురువారం దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ ముద్దసాని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పూసాల సంపత్ మాట్లాడుతూ.... ఎమ్మెల్యేగా, మంత్రిగా కమలాపూర్ నియోజకవర్గంలో రోడ్లు, అనేక అభివృద్ధి కార్యక్రమాలతో ఎన్టీఆర్ మెప్పు పొందాడన్నారు. ముద్దసాని చేసిన అభివృద్ధికి కృతజ్ఞతగా ఏదైనా కళాశాలకు ఆయన పెట్టాలని ప్రభుత్వ విప్ విజయ రామణారావును కోరుతూ జమ్మికుంటలో ముద్దసాని విగ్రహా ఏర్పాటుకు హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి ప్రణవ్ బాబుకు బాధ్యతను అప్పగించడం శుభసూచకమని, ముద్దసాని సేవలు మరువలేనివంటూ పూసాల సంపత్ కొనియాడారు.

# లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్ఓబిలకు శ్రీకారం





**జమ్మికుంట, ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** దక్షిణ మధ్య రైల్వే వారు రైల్వే లైన్ విస్తరణ మరియు అభివృద్ధి లో భాగంగా లెవల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ లను ఏర్పాటు చేయుటకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎల్ సి.20 లెవెల్ క్రాసింగ్ జమ్మికుంట-మడిపల్లి క్రాస్ రోడ్డు, ఎల్ సి .25 లెవెల్ క్రాసింగ్ బిజిగిర్ షరీఫ్- పాపయ్యపల్లి గ్రామ క్రాస్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్‌ల కొరకు జాయింట్ ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో తహసిల్దార్ నల్ల వెంకట్ రెడ్డి, గిర్ధవార్లు సత్యనారాయణ, శంకర్, జి పి ఓ లు రెండు గ్రామాల సర్పంచ్ లు, మ్యకమల్ల తిరుమల వెంకటేష్, అమరగొండ నిర్మలా బాబు రావు పంచాయతీ కార్యదర్శులు మున్సిపల్ సిబ్బంది, రోడ్ సెక్టార్ రైల్వే భూ సేకరణ నిపుణులు పి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు

## - కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు అండగా ఉంటాం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీవీఏఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. పెద్దపల్లి సర్కిల్ కార్యాలయం ముందు జరుగుతున్న సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి. జ్యోతి, సీపెల్లి రవీందర్ లు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ల నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల పట్ల ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వరంగల్ ఎన్పీడీసీఎల్ ముందు వేలాది మందితో మహాధర్నా చేసినా స్పందించకపోవడం ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శన మన్నారు. ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేస్తూ వివక్ష చూపడం దారుణమన్నారు. అర్హత కలిగిన కార్మికులకు వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని, అన్ మాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీఓ 11 ప్రకారం పీస్ రేట్, స్పాట్ బిల్లింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు.కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, నర్సయ్య, నరేష్, కొండయ్య, జడలు సత్యనారాయణ, కాశీం, మాంకాళి రాజు, చిన్నయ్య, రమేష్, జగన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సహాయక ఉపకరణాలు, అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ దివ్యంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో దివ్యంగులకు సహాయక ఉపకరణాలు,17 త్రీ వీలర్ మోటార్ సైకిళ్లతో పాటు అంగన్‌వాడీ టీచర్లకు (డి డబ్ల్యూ ఓ ద్వారా) కేటాయించిన 117 మొబైల్ ఫోన్లను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ , నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాంకేతికతను వినియోగించుకుని అంగన్‌వాడీలు తమ సేవలను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు.

# రామగుండంలో ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తిలో ప్రజలు

## ● నాడు ఎడ్చాడు... నేడు ప్రజలను ఎడిపిస్తున్నాడు ● దొంగ ఓట్ల నిర్మూలన కోసం బీ.ఆర్.ఎస్ శ్రేణులు పని చేయాలి ● రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండంలో ఎమ్మెల్యే పాలన పట్ల ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారు. నాడు ఎన్నికల సమయంలో దొంగ ఎడ్పులు ఎడ్చి అధికారం రాగానే నేడు ప్రజలను ఎడిపిస్తున్నడని రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్ల నిర్మూలన బీ.ఆర్.ఎస్ పార్టీ అధినాయకత్వం తీసుకున్న విధానాలకు కట్టుబడి రామగుండం నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీ లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ గురువారం జరిగిన రామగుండం నియోజకవర్గ విస్తృత స్దాయి సమావేశం ఆయన మాట్లాడుతూ ఒక్క ఓటు దుర్వినియోగం అయినా ఆయా అభ్యర్థుల భవితవ్యమే మారుతుందని అన్నారు. రామగుండం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చనిపోయిన వారి ఓటు ఉన్నా, ఇక్కడి నుండి వేరే చోటకు వెళ్ళినవారు ఉన్నా వారి ఓటును తొలగించే విధంగా అధికారులకు తెలియపర్చాలని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు తమ వద్దకు వచ్చి ఏడ్చి ఇప్పుడు తమను ఏడిపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ఈ ప్రాంతంలోనే ఉండకుండా తరిమికొట్టడానికి రామగుండం నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి మాజీ



జెడ్పీటీసీ అముల నారాయణ, మురలీధర్ రావు, ఈ సమావేశం లో నాయకులు కౌశిక హరి నడిపెల్లి మురలీధర్ రావు మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ కార్పోరేటర్లు మేకల సమ్మయ్య యాదవ్ మేకల శారదా కరక పద్మ శ్రీనివాస్ రెడ్డి తోకల రమేష్ గుర్రం ముత్యాలు నాయకులు నారాయణదాసు మారుతి బోడ్డు రవీందర్ మెతుకు దేవరాజు, జెవి. రాజు, నూతి తిరుపతి, చెలుకలపల్లి శ్రీనివాస్ మేడి సదానందం కల్వచర్ల కృష్ణ వేణీ బాదె అంజలి ఇరుగురాళ్ల శ్రావన్ కోలుగూరి సాయి కుమార్ (చింటూ) పిల్లి రమేష్ గౌస్ బాబా కిరన్ జీ విరాలాల్ బుర్రి వెంకటేష్ కొడి రామకృష్ణ గుంపుల లక్ష్మి గుర్రం పద్మ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మింగుడు పడకనే పథకాలపై బిఆర్ఎస్ దుష్ప్రచారం: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత పదేళ్లలో ఏ పథకాన్ని ఇవ్వకపోగా నేడు కాంగ్రెస్ ఇస్తున్న పథకాలు చూసి మింగుడు పడక బిఆర్ఎస్ దుష్ప్రచారాలు చేస్తుందన్నారు.ప్రభుత్వ ఆర్థిక స్థితి సరిగా లేకున్నా ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం గుడాటిపల్లిలో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.తాహశీల్దార్ కే.సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్,టిపిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్,ఏఎంసి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి నాయకులు ఊకంటి మధుకర్,గొట్టె మధు, బండారు తిరుపతి, కవ్వ పద్మ, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, కోరం రాజిరెడ్డి, యువజన నాయకులు ఆడెపు అజయ్, షారుక్, ఇషాముద్దీన్, మహేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పూలే--అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు శ్రీకారం...

### - యువతలో చైతన్యానికి ఎస్ఎఫ్ఐ పిలుపు... - కర పత్రాన్ని ఆవిష్కరించిన సిఐ సతీష్ రెడ్డి..... - ఎస్ఐ సాయి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు



**నల్గొండ జిల్లా ప్రతినిధి/(ది క్రైమ్ న్యూస్): ఏప్రిల్:09** హాలియా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించే పూలే ,అంబేద్కర్ జయంతి ఉత్సవాల కలపత్రాన్ని ఆవిష్కరించి అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం, అందరికీ విద్య, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయులు జ్యోతిరావు పూలే డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతిల సందర్భంగా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, వారి స్ఫూర్తితో గంజాయి డ్రగ్స్ నిర్మూలిద్దాం.. బెట్టింగ్ యాప్స్ వ్యతిరేకిద్దాం నినాదం తో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు నేటి సమాజంలో విద్యార్థి, యువతను బలహీన పరుస్తున్న అతి పెద్ద శత్రువు గంజాయి డ్రగ్స్ అన్నారు డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి చేతిలో ఉన్నాయి. ఈ సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించుకొని కొన్ని సంస్థలు బెట్టింగ్ యాప్స్ రూపంలో విద్యార్థి,యువతను తప్పుదారి పట్టిస్తున్నాయి అని అన్నారు. మొదట సరదాగా మొదలైన ఈ రెండు సమస్యలు విద్యార్థి యువత భవిష్యత్తు జీవితాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన అలవాట్లు కావున వీటికి వ్యతిరేక ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ మహనీయుల జయంతిల సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులను ప్రజలను యువతలను చైతన్య పరచాలని సంకల్పంతో నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్ కోరే రమేష్ ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** ఒకే సంస్థలో పని చేస్తున్న వారందరికీ ఒకే రకమైన సర్వీస్ నిబంధనలు వర్తింపజేయాలని, విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్, ఆన్ మ్యాన్డ్, స్పాట్ బిల్లర్ల ను రెగ్యులరైజ్ చేయాలని ఎన్పీడీసీఎల్ కంపెనీ జేఏసీ చైర్మన్ ధరావత్ సికిందర్ అన్నారు. విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ అన్ మ్యాన్, స్పాట్ బిల్లర్లు, పీస్ రేట్ వర్కర్లు, ఎస్ పి ఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో రెండవ రోజు సమ్మె చేపట్టారు. జేఏసీ డివిజన్ చైర్మన్ పసుపులేటి మధు తో కలిసి ధరావత్ సికిందర్ మాట్లాడుతూ...ఆర్టిజన్లను రెగ్యూలర్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలదేనన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని, ఆన్ మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, ఏపిఎస్ఈబీ నిబంధనలు అమలు చేయడంతో పాటు గృహజ్యోతి పథకం ద్వారా బిల్లింగ్ కార్మికులను ఆదుకోవాలని, పీస్ రేట్ కార్మికులకు 30 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లను విద్యార్హత ఆధారంగా రెగ్యూలర్ చేయాలని, కార్మికులందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంధ్య, జ్యోతి, హరీష్, రామకృష్ణ ,ఉపేందర్, సుదర్శన్ , పాషా , శేఖర్, శ్రీరామ్, యాకయ్య, వెంకన్న, శ్రీధర్ బాబు, హరిప్రసాద్, సోమాని, లక్ష్మణ్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాలను కాపాడుకోవాలి

**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** నేటి పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ పాటించాలని, ఆరోగ్యాలను కాపాడుకోవాలని తొర్రూరు డిఎం పద్మావతి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆరోగ్యం, వైద్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షుగర్, బరువు, హిమోగ్లోబిన్, బీపీ, మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా డి ఎం మాట్లాడుతూ... నేటి పరిస్థితుల్లో ఆరోగ్యం పై దృష్టి సారించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. ఆహార నియమాలు పాటించాలని, ఆరోగ్యమే అసలైన సంపదని, సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని అన్నారు. మితాహారం, వ్యాయామంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని,మంచి ఆరోగ్యానికి ఆహార అలవాట్లే ప్రధానమని,ఆహార అలవాట్లు,ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. . డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య రక్షణకు సంబంధించిన సలహాలు ఇవ్వడమే కాకుండా సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, శుభ్రమైన నీరు త్రాగడం వంటి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్ కుమార్, ఎస్ టి ఐ రజితా రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం

## యునైటెడ్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్)తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 18న శనివారం నాడు హైదరాబాద్‌లోని తార్నాకలో గల మర్రి కృష్ణా రెడ్డి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి తెలిపారు.ఈ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు విజయశాంతి, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ కాశిం హాజరవుతారని పేర్కొన్నారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలను ఆహ్వానించినట్లు వెల్లడించారు. తెలంగాణ కోసం పోరాడిన గ్రామ, మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఉద్యమకారులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ తెలంగాణ ఆనంద్, రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్, ఉత్తర తెలంగాణ మహిళా కన్వీనర్ ఐలా ప్రసన్న, కటంగూరి శ్రీకాంత్ రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరే రమేష్ రెడ్డి, సరిగొమ్ముల సదానందం, రేణుకుంట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో క్రీడా జోష్ ఘనంగా కేపీఎల్ ప్లేయర్స్ వేలం




**మంథని ఏప్రిల్ 9 (ది క్రైమ్ న్యూస్):** కమాన్‌పూర్ మండల కేంద్రం క్రీడా ఉత్సాహంతో కళకళలాడింది. స్వర్గీయ శ్రీపాదరావు స్మారకార్థంగా నిర్వహిస్తున్న కమాన్‌పూర్ ప్రీమియర్ లీగ్ (ఖుా) సీజన్--1లో భాగంగా ప్లేయర్స్ వేలం కార్యక్రమం కేఎన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందనను అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ టోర్నమెంట్ బహుమతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల వైపు మొగ్గుచూపడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంపొందుతాయని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. మరో ముఖ్య అతిథి కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో క్రీడలకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, సమన్వయ భావన పెంపొందిస్తాయని, ఈ లీగ్ ద్వారా స్థానిక ఆటగాళ్లకు పెద్ద స్థాయి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ వేలం కార్యక్రమంలో ఎనిమిది ఫ్రాంచైజీ యజమానులు అయినా ఎస్. సయ్యద్ అన్వర్, ఇనగంటి రామారావు, పీట్ల గోపాల్, అంబీరు శ్రీను, కోలేటి దామోదర్, రెబల్ రాజ్ కుమార్, మెహరాజ్ అహ్మద్ ఖాన్, కుక్క కుమార్ పాల్గొని ఆటగాళ్లను పోటీగా ఎంపిక చేసుకోవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బిడ్డింగ్ ప్రక్రియ ఉత్సాహభరితంగా సాగి క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రతి జట్టు తమకు కావాల్సిన ప్రతిభావంతులను ఎంపిక చేసుకోవడంలో ప్రత్యేక ఆసక్తి చూపింది. కేపీఎల్ నిర్వాహకులు కుక్క కుమార్, మెరుగు కుమార్, కొండయ్య, మెడగొని సాయికిరణ్ ఈ లీగ్‌ను విజయవంతం చేయడానికి సమన్వయంతో పనిచేస్తున్నారు. యువతకు సరైన వేదికను అందించి క్రీడా రంగంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి చంద్రశేఖర్,కిషన్ రెడ్డి, సయ్యద్ ఇక్బాల్,అబ్దుల్ రఫిక్, ఇనగంటి శ్రావణ్ కుమార్, మల్యాల శేఖర్, మల్యాల మహేష్, రఫిక్ సోహెల్, మల్యాల నరేష్,పంజా సాయిరాం గౌడ్,కలీమ్, మెడగోని విజయ్,కుక్కరవి తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ కార్యక్రమం కమాన్‌పూర్‌లో క్రీడా సంస్కృతిని మరింత బలపరుస్తూ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లు స్పష్టమవుతోంది.

# పటాన్చెరులో పాఠశాల కబ్జాలపై ఎంపీ రఘునందన్ ఆగ్రహం





**పటాన్ చెరు, ఏప్రిల్ 09(ది క్రైమ్ న్యూస్):** పటాన్చెరు జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా జరుగుతున్న కబ్జాలను ఎంపీ రఘునందన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో కలిసి ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. పరిశీలన అనంతరం ఎంపీ మాట్లాడుతూ, సర్వే నంబర్ 428లో ఉన్న 2 ఎకరాలు 18 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ పనులు కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపడుతుందని, ఈ అభివృద్ధి కార్యక్రమాలకు కబ్జాదారులతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనూ, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలోనూ ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జా చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. అదేవిధంగా, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రే కూల్చివేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు పాఠశాల కాంపౌండ్ వాల్ బయటే చేపట్టాల్సి ఉండగా, భౌండరీ దాటి తరగతి గదులను కూల్చివేయడం వెనుక ఉన్న ఆంతర్యంపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, పాఠశాల భవనాలను కూల్చిన మిషనరీ, కాంట్రాక్టర్లు మరియు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# నల్తూరులోనే యంగ్ ఇండియా పాఠశాల కొనసాగించాలని ఎమ్మెల్యేకు వినతి

**పటాన్చెరు, ఏప్రిల్ 09, (ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూరు గ్రామంలో ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాల తరలింపుపై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో, పాఠశాలను నల్తూరులోనే కొనసాగించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. గురువారం పటాన్చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్, కౌన్సిలర్లు కలిసి, నల్తూరు గ్రామంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాల కొనసాగించాలని వారు కోరారు. వారి వినతిపై స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ప్రజల అభీష్టం మేరకు పాఠశాల కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని, జిన్నారం ప్రజలు ఎక్కడ కోరుకుంటే అక్కడే పాఠశాల కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్ మాట్లాడుతూ, పాఠశాల నిర్మాణంపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, నల్తూరు గ్రామంలోనే పాఠశాల నిర్మాణం కొనసాగించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, బేలే కృష్ణ, నాయకులు శంకరప్ప, ఆదిరామకృష్ణ, కొడకంచి నాగరాజు, పెద్దమ్మగూడెం నాగరాజు, మాజీ సర్పంచులు యాదయ్య, శ్రీశైలం యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ కృష్ణతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నల్లూరులో యంగ్ ఇండియా పాఠశాలపై వివాదం

**• ఎమ్మెల్యే వైఖరిపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం • నల్లూరు పాఠశాల తరలింపుపై రాజకీయ దుమారం... • ఎమ్మెల్యేపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**



**పటాన్చెరు(జిన్నారం), ఏప్రిల్ 09(ది క్రైమ్ న్యూస్) :** జిన్నారం మండలంలోని నల్లూరు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంపై రాజకీయ వివాదం చెలరేగింది. సర్వే నెంబర్ 158లో 25 ఎకరాల స్థలంలో రూ.200 కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంజూరు చేయగా, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ పాఠశాలను నల్లూరులో కాకుండా పోచారం ప్రాంతానికి తరలించాలని కోరుతూ బుధవారం కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిన్నారం మండల కాంగ్రెస్ నాయకులు గురువారం జిన్నారం కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే వైఖరిని తీవ్రంగా ఖండించారు. గతంలో మోడల్ స్కూల్‌ను కూడా జిన్నారంలో కేటాయించకుండా అడ్డుకుని బొల్లారంకు తరలించారని, ప్రస్తుతం యంగ్ ఇండియా పాఠశాలను కూడా పోచారానికి తరలించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, గత 8 నెలలుగా అధికారులు సర్వే చేసి, పేద విద్యార్థుల చదువుకు నల్లూరు గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయడం అనుకూలమని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నల్లూరు గ్రామ స్థితి గురించి తెలియనట్లు మాట్లాడటం విచిత్రమని విమర్శించారు. గతంలో జిన్నారంలో కోర్టు మంజూరు విషయంలో కూడా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. జిన్నారం మండలాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, మున్సిపాలిటీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు వెంటనే స్పందించి తమ నిర్ణయం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో రైతు వేదిక వావిలాలకు మంజూరైనప్పటికీ, జిన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయించి త్యాగం చేశామని పేర్కొన్నారు. జిన్నారం గ్రామపంచాయతీలను మున్సిపాలిటీగా మార్చినప్పటికీ అభివృద్ధి లేకపోయిందని విమర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ మాట్లాడుతూ, నల్లూరు గ్రామంలో పాఠశాల నిర్మాణానికి అనుకూల వాతావరణం ఉందని తహసీల్దార్ సర్వే చేసి, అధికారులు పరిశీలన అనంతరం కలెక్టర్కు నివేదిక సమర్పించారని తెలిపారు. జిన్నారం ప్రజలు ఏ పాపం చేశారని ప్రశ్నిస్తూ, వెనుకబడిన ప్రాంతాన్ని మరింత వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు ఆయనను జిన్నారం మండలంలోకి రానివ్వరని హెచ్చరించారు. అఖిలపక్ష నాయకులు స్పందించాలని కోరుతూ, నల్లూరు గ్రామంలోనే పాఠశాల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలి : రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బూత్ కమిటీల పూర్తి చేసి, పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మసీద్ బండలోని బీజేపీ కార్యాలయంలో బూత్ కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్, రవీందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండున్నర సంవత్సరాల సమయం ఇచ్చినా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పనులు చేయలేదని విమర్శించారు. ఇప్పటికీ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో బూత్ కమిటీలను పూర్తి చేయాలని, బూత్ అధ్యక్షులు, సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు దగ్గరగా ఉంటే వారి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి, ఎక్కువ మందిని పార్టీలో చేర్చాలని నాయకులకు పిలుపునిచ్చారు. అలాగే అంబేద్కర్ జయంతిని నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

## కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన





రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో రూ. 40 కోట్ల 50 లక్షల అంచనావ్యయంతో నిర్మించబడనున్న 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, డీఎంహెచ్ఓ లలిత దేవి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాసరావు తదితరులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ, పీఏసీ చైర్మన్ గాంధీ కొండాపూర్ ఆసుపత్రి, డయాగ్నస్టిక్స్ హబ్‌ను సందర్శించి, అక్కడి వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులపై పేషెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ రూ. 40.50 కోట్ల వ్యయంతో నిర్మించబడనున్న ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ నియోజకవర్గ ప్రజలకు, పరిసర ప్రాంతాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగని పేర్కొన్నారు. అన్ని ఆధునిక సదుపాయాలతో, నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టి, ఎక్కడా రాజీపడకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం: మంత్రి దామోదర్ రాజనరసింహ




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఎయిడ్స్ పై అవగాహన కీలకమని మంత్రి దామోదర్ రాజనరసింహ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎయిడ్స్ అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖామంత్రి దామోదర్ రాజనరసింహ , ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, కలెక్టర్ నారాయణ రెడ్డి, డీఎంహెచ్ఓ లలిత దేవి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు ర్యాలీలు, మానవహారాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ అనేది శరీర రోగనిరోధక శక్తిని బలహీనపరచే వైరస్ అని, సరైన చికిత్స లేకపోతే ఎయిడ్స్‌గా మారుతుందని వివరించారు. రక్షణలేని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి వంటి కారణాలతో హెచ్ఐవీ వ్యాపిస్తుందని, అయితే చేతులు కలపడం, కలిసి భోజనం చేయడం వంటి సాధారణ పరిచయాల ద్వారా వ్యాప్తి చెందదని స్పష్టం చేశారు. అవగాహన లేకపోవడం వల్లే భయాలు, అపోహలు పెరుగుతున్నాయని, ప్రజల్లో చైతన్యం పెంచడం అవసరమన్నారు. హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపడం చట్టవిరుద్ధమని, వారికి గౌరవం, సహాయం, సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ప్రస్తుతం సమయానికి పరీక్షలు, సరైన చికిత్స తీసుకుంటే హెచ్ఐవీ ఉన్నవారు కూడా సాధారణ జీవితాన్ని గడపగలరని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా టెస్టులు, చికిత్స, ఔషధాలు అందిస్తున్నదని, రాష్ట్రవ్యాప్తంగా 127 టెస్టింగ్ సెంటర్లు, 33 ఆర్ట్ సెంటర్ల ద్వారా లక్షలాది మందికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. యువతకు ప్రత్యేకంగా సూచిస్తూ, అనారోగ్యకర అలవాట్లకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల హెచ్ఐవీ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా బలమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సోషల్ మీడియాలో అసభ్య, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నివాసి చెన్నయ్య రుంజాల యూట్యూబ్‌లో రీల్స్ వీక్షించే అలవాటు ఉన్నాడు. ఇటీవల నటి రేణు దేశాయ్‌కు సంబంధించిన వీడియోను చూసిన అనంతరం తన యూట్యూబ్ ఖాతా ద్వారా అసభ్యకర, దూషణాత్మక వ్యాఖ్యను పోస్ట్ చేసినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుంటూరులో అదుపులోకి తీసుకొని, అనంతరం గచ్చిబౌలి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడు తన మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అందజేసి, అదే ఫోన్ ద్వారా వ్యాఖ్యను పోస్ట్ చేసినట్లు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, అసభ్య, దూషణాత్మక పోస్టులు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. ఇటువంటి చర్యలు చట్టపరమైన సమస్యలకు దారితీస్తాయని పేర్కొన్నారు. ఏవైనా సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలనీ లేదా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మాజీ ఎంపిటిసికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే



**బెజ్జంకి, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి తాజా మాజీ ఎంపిటిసి నల్లగొండ లక్ష్మీ గుండెపోటుతో గురువారం మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆమె పార్థివ దేహానికి పూలదండ వేసి నివాళులర్పించారు.లక్ష్మి మృతి ఆమె కుటుంబానికి, పార్టీకి తీరని లోటని,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆ కుటుంబానికి రసమయి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యేతో పాటు లక్ష్మీకి నివాళులర్పించారు.

## భార్యపై భర్త హత్యాయత్నం..... నిందితుడి రిమాండ్



**ఇల్లంతకుంట, ఎప్రిల్ 9(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాకలో గురువారం ఓ వ్యక్తి తన భార్యపై హత్యయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన యాస రాజయ్య తన భార్య సునీత కళ్ళల్లో కారంపొడి చల్లి ఇనుప రాడుతో దాడి చేసి హత్యకు యత్నించాడు.వీరికి ఒక కూతురు ఉండగా బాదితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు రాజయ్యపై కేసు నమోదు చేసుకుని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండుకి తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సిఐ కదిరి నాగేశ్వరరావు తెలిపారు.

## గోర్లు కొరికే అలవాటు మీకు ఉందా..? అయితే తెలియకుండానే సమస్యల్లో..



దైనందిన జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు మనల్ని వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం.. అయితే, మన గోర్లలో ఎన్నో రకాల బ్యాక్టీరియా దాగుంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా మనం రోజు మొత్తంలో చేతులను చాలా సార్లు తాకుతాము. ముఖం నుంచి శరీరంలోని ఇతర భాగాల వరకు.. చేతులతో తాకుతాం.. అయితే, మీ అందమైన గోర్ల క్రింద లక్షలాది సూక్ష్మ జీవులు నివసిస్తాయన్న విషయం మీకు తెలుసా? తెలియకపోతే.. ఈ స్టోరీ చదవాల్సిందే.. మన గోర్ల కింద 32 రకాల బాక్టీరియాలు, 28 రకాల ఫంగస్‌లు ఉన్నాయని ఓ పరిశోధన వెల్లడించింది. ఈ పరిశోధన 2021లో జరిగింది. అమెరికన్ పాడియాట్రిక్ మెడికల్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించారు. పరిశోధకులు గోర్ల కింద నుంచి శాంపిల్స్ తీసుకుని వాటిని టెక్నికల్ పద్దతుల్లో విశ్లేషించగా అందులో 32 రకాల బ్యాక్టీరియా, 28 రకాల ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. వీటిలో, 50% నమూనాలలో బ్యాక్టీరియా మాత్రమే ఉంది. 6.3% మాత్రమే ఫంగస్‌ను కలిగి ఉంది. 43.7% బ్యాక్టీరియా, ఫంగస్‌ల మిశ్రమ సమూహాన్ని కలిగి ఉన్నట్లు అధ్యయనం తెలిపింది. కాలి గోర్లలో కూడా బ్యాక్టీరియా ఉంటుందని అధ్యయనం పేర్కొంది. అందుకే గోర్లు, చేతుల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకతపై నివేదికలు నొక్కిచెబుతున్నాయి. అన్నింటికంటే, మనం తినడానికి, ముక్కు తుడుచుకోవడానికి లేదా ఎవరినైనా కౌగిలించుకోవడానికి, ప్రతిదానికీ మన చేతులను ఉపయోగిస్తాము. అటువంటి పరిస్థితిలో, గోర్ల శుభ్రత మన అందానికే కాదు, మన ఆరోగ్యానికి కూడా చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు.. పరిశోధకులు ఏమి చెప్పారు? గోర్ల కింద ఉండే బ్యాక్టీరియా, ఫంగస్ సాధారణంగా హానిచేయనివని పరిశోధకులు చెబుతున్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో, ఈ సూక్ష్మజీవులు బలహీనమైన ఇమ్యూనిటీ పవర్ ఉన్నవారిలో లేదా గోళ్లలో ఏదైనా గాయం లేదా ఇన్ఫెక్షన్ ఉన్నవారిలోకి ఈజీగా ప్రవేశిస్తాయి. ఇన్ఫెక్షన్ లక్షణాలు గోర్లు రంగు మారడం, వాపు, నొప్పి, చీము కారడం వంటివి ఉండవచ్చు. గోర్లను శుభ్రంగా ఉంచుకోవడం ఎలా? మీ చేతులు, గోర్లను సబ్బు, నీటితో కనీసం రోజుకు రెండుసార్లు కడగాలి. గోర్ల కింద మురికి పేరుకుపోకుండా ఉండేందుకు సాఫ్ట్ బ్రష్ ఉపయోగించండి. పొడవాటి గోర్లు ఉంచుకోవడం మానుకోండి. ఎందుకంటే వాటిలో ధూళి, క్రిములు సులభంగా పేరుకుపోతాయి. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోండి.. గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించడానికి పదునైన సాధనాలను ఉపయోగించండి. నెయిల్ పెయింట్ వేయడానికి ముందు, తర్వాత మీ గోర్లను శుభ్రం చేసుకోండి. గోళ్లలో ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా ఏదైనా అసాధారణత కనిపించినట్లయితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి.

# ఆంధ్రప్రదేశ్

## సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది

**జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత**

**మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స**

అల్లూరి,ఏప్రిల్9 : సరదాగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవాలని యువత పడుతున్న ఆరాటం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సెల్ఫీ మాయలో పడి తమ వైపు పొంచి ఉన్న ముప్పును తెలుసుకోలేక అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఎన్నో. అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. మృతులు త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16)ను హుకుంపేట మండలం జుంబువలస వాసులుగా స్థానికులు గుర్తించారు. ఇటీవలే వీరంతా ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. సెల్ఫీ పిచ్చి వీరిని ప్రమాదంలోకి నెట్టేసింది. తాజాగా అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ మల్లంగుమి గ్రామ సమీపంలో ఉన్న జలపాతం వద్ద నలుగురు యువతులు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయారు. వారిలో ముగ్గురు అమ్మాయిలు మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురమ్మాయిలు జలపాతం సమీపంలో నిలిచి ఉండగా.. మరొక అమ్మాయి సెల్ఫీ తీస్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నలుగురు అమ్మాయిలను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ముగ్గురు యువతులు మరణించారు. ఓ యువతిని రక్షించి ఆస్పత్రికి తరలించగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు బూర్జ పంచాయతీ జంబు వలస గ్రామానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. అంజలి అనే మరో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. యువతుల మృతితో జంబు వలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారం

**ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు**

**ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

ఏలూరు,ఏప్రిల్9 : ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాజుతోపాటు మరో ఆరుగురు దేవస్థానం ఉద్యోగులను అరెస్ట్ చేశామని చెప్పారు. గురువారం ఏలూరులో డీఎస్పీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నిందితుల వద్ద నుంచి నకిలీ టికెట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారంలో ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నకిలీ దర్శనం టికెట్ల విక్రయం బహిర్గతమైంది. ఆలయంలో స్కానింగ్ పాయింట్ వద్ద కొన్ని దర్శనం టికెట్లు స్కాన్ కాకపోవడంతో ఈ వ్యవహారం బట్టబయలు అయింది. ఈ వ్యవహారంలో దేవస్థానం ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవాలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తుంటారు. భక్తులు.. కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేసి దేవాలయంలో ప్రవేశించి.. స్కానింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బందికి వాటిని ఇస్తారు. వారు ఈ టికెట్లను స్కాన్ చేసి భక్తులను దేవాలయంలోకి అనుమతిస్తారు. ఆలయంలో ఏఈవో కుమారుడు రాజు దేవాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.200 టికెట్లను అతడు టికెట్ కౌంటర్‌లో విక్రయించాడు. అవి ఆలయంలో స్కానింగ్ పాయింట్ల వద్ద స్కాన్ చేస్తే.. టికెట్లు స్కాన్ కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి భద్రతా సిబ్బంది తీసుకెళ్లారు. వారు వెంటనే రంగంలోకి దిగి.. కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లను పరిశీలించారు. అవి 61 టికెట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ టికెట్లు జారీ చేసిన రాజును దేవస్థానం అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు దేవస్థానం ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన ఎమ్మెల్యే

కాకినాడ,ఏప్రిల్9 : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపుడి హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం అమలు విధానాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో కలిసి స్వయంగా క్యూలైన్‌లో నిలబడిన ఎమ్మెల్యే.. భోజనం పెట్టించుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు అందరూ పాఠశాలలోనే భోజనం చేసేలా నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు, విద్యా కమిటీ ఛైర్మన్ బాజీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం చేయని పలువురు విద్యార్థులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. పాఠశాలలో ఉన్న 540 మంది విద్యార్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ప్లేట్లను అందిస్తామన్నారు.

## దేశమంతా అమరావతికి ఓకే .. జగన్ మాత్రం నో

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని**

బాపట్ల : ప్రపంచంలో తెలుగువారంతా గర్వించే నగరం అమరావతి అని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని పార్టీలు అమరావతినే రాజధానిగా కావాలన్నారని పేర్కొన్నారు. ఒకే ఒక్క వైసీపీ మాత్రం అమరావతిని వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. రాజధాని రైతుల పాదయాత్ర ఈ ప్రాంతం గుండా వెళ్లిందని చెప్పుకొచ్చారు. అప్పుడు రైతులకు తాము మద్దతిచ్చామని అన్నారు. గురువారం బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మంత్రి అనగాని హాజరై మాట్లాడారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో గందరగోళం చేశారని ఆగ్రహించారు. జగన్ ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. రైతుల భూములను 21ఏ లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారని ÷ర్ అయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని ప్రస్తావించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పాసుపుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేశారని ఎద్దేవా చేశారు. రైతులు భూమిని ఆత్మగౌరవంగా భావించారని.. అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని అన్నారు. తుగ్లక్ పార్టీని మరోసారి అధికారంలోకి రాకుండా జనం చూడాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

# దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

**చిర,చరాస్థులు కూడా లేవు**

**సొంత ఇల్లు అంతకన్నా లేదు**

**బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ**



కోల్‌కతా,ఏప్రిల్ 9(ఆర్ఎన్ఎ): మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు. గత ఐదేళ్లలో మమత బెనర్జీ ఆస్తులు తగ్గడం గమనార్హం. కాగా, 2021లో ఆమె చరాస్తులు విలువ రూ.16.72లక్షలుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 4.2025-26 ఆర్థిక సంవత్సరంలో దీదీకి రూ.40,600 టీడీఎస్ రిఫండ్ వచ్చినట్లు తన అఫిడవిట్‌లో తెలిపారు. ఇక రాయల్టీలు, బ్యాంక్ వడ్డీలు తన ప్రాథమిక ఆదాయ వనరుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నామినేషన్ పత్రాల్లో కాళీఘాట్‌లోని 30 డి హరీశ్ చటర్జీ వీధిని తన చిరునామాగా పేర్కొన్నారు మమతా బెనర్జీ. అయితే, ఆ ఇల్లు ఆమె పేరిట రిజిస్టార్ మాత్రం కాలేదు. ఇప్పటి వరకు తనకంటూ ఒక సొంత ఇల్లు లేదని ఆమె అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం.

## ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు

**సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం**

**గొల్లపూడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సందర్శించిన కేంద్రకార్యదర్శి**

విజయవాడ,ఏప్రిల్ 9 : కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ గురువారం గొల్లపూడిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి.. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు, సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం వంటి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణకు అనుసరిస్తున్న విధానాలతో పాటు టీబీ ముక్త భారత్ అభియాన్ – 100 రోజుల ప్రచార కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పోర్టబుల్ ఎక్స్‌రే వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలు తేలిగ్గా ఎక్కడెక్కడికో వెళ్లనవసరం లేకుండా తమకు దగ్గర్లోనే పరీక్షలు చేయించుకునేందుకు వీలవుతుంది. అనంతరం నిక్షయ్ మిత్ర చొరవ ద్వారా క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను అనుసంధానం చేస్తూ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు సత్వర నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2024, డిసెంబర్‌లో ప్రారంభమైన రెండో విడత ఇంటెన్సి÷డ్ టీబీ ముక్త భారత్ అభియాన్ ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని.. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటుతో పోలిస్తే భారత్‌లో టీబీ కేసులు, మరణాల తగ్గుదల రెట్టింపు వేగంతో కొనసాగుతున్నట్లు వివరించారు. డేటా విశ్లేషణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో దేశవ్యాప్తంగా టీబీ ముప్పు అధికంగా ఉన్న 1,58,000 గ్రామాలు, పట్టణ వార్డులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టీబీ ముక్త భారత్ యాప్ – నిక్షయ్ ద్వారా రోగులు, వైద్య నిపుణులకు సరైన మార్గనిర్దేశర అందుతోందని చెప్పారు. ఏఐ చాట్‌బాట్ ద్వారా రోగులకు తక్షణ సహాయం అందించడం జరుగుతోందని.. టీబీ రోగులకు పౌష్టికాహారం, సామాజిక మద్దతు అందించడంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా పౌష్టికాహారం, మానసిక స్థైర్యంతో టీబీపై విజయం సాధించవచ్చని పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సెంట్రల్ టీబీ డివిజన్) రఘురామ్ రావు, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెశ్వేశ్వరి, జేడీ (ఎన్‌టీఈపీ) డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

**శాంతియుత నిరసనలతో ఖండించాలి**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

చిత్తూరు,ఏప్రిల్9 : పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## సోషల్ మీడియా పోస్టింగ్‌లపై హైకోర్టు ఆగ్రహం

**పోలీసులు కఠినంగా ఉంటే ఇలా జరిగేది కాదని వ్యాఖ్య**

అమరావతి,ఏప్రిల్ 9 : సామాజిక మాధ్యమాల పోస్టింగ్‌లపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2029లో మీరు చేసే విధ్వంసం కోసం ఎదురు చూస్తున్నట్లు ఫ్లెక్సీలు పెడతారా? అంటూ ఘాటుగా ప్రశ్నించింది. ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటే ఎంత ధైర్యం ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎవరిని విధ్వంసం చేస్తారు.. రాష్టాన్నా? రాష్ట్ర ప్రజలనా? అని ప్రశ్నించింది. సీఎంను అవమానించడ మంటే 5 కోట్ల ఆంధ్రులను అవమానించడం కాదా? వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడుతారా? అవమానించేలా మాట్లాడే హక్కు, పోస్టులు పెట్టే అధికారం ఎవరిచ్చారు అన ఇప్రశ్నించింది. వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి పునరావృతం అయ్యేదే కాదు. కోర్టులు, చట్టమంటే భయం కలిగేలా పోలీసుల చర్యలు ఉండాలి. పోలీసులు కఠినంగా ఉంటే 2024 తర్వాత కూడా పోస్టులు పెట్టే ధైర్యం ఎలా వస్తోంది? అభ్యంతరకర పోస్టుల కేసులను డీల్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారని ఏపీ హైకోర్టు ఆక్షేపించింది. వైకాపా సోషల్ మీడియా పూర్వ ఇన్‌ఛార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు విచారించింది. ఈ కేసులో హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తూ ఉన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

## ఐదేళ్లుపాటు జగన్ విధ్వంస పాలన

**ఒక్క ఛాన్స అంటూ రాష్ట్రం లూటీ**

**టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు**

విజయవాడ,ఏప్రిల్ 9 : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు మరోసారి నిప్పులు చెరిగారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి పరదాలు కట్టుకుని తిరిగారని.. తాడేపల్లి ప్యాలెస్ దాటి బయటకు రాలేదంటూ జగన్ ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలో దేవినేని ఉమామహేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ.. ఐదేళ్లు పరిపాలన చేసి రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించరంటూ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. మళ్లీ అధికారం కోసం అర్రులు చాస్తున్నారని మండిపడ్డారు. ప్రజా వేదిక విధ్వంసంతో మొదలైన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు మంచి నీరు ఇవ్వడానికి కూడా చేతులు రాలేదంటూ జగన్ తీరును ఎండగట్టారు. ఐదేళ్ల విధ్వంస పాలనలో అడ్డగోలుగా చేసిన అవినీతి బయటకు తీయటానికే సగం మంది అధికారులకు సరిపోతుందని వ్యంగ్యంగా అన్నారు. లిక్కర్ దోపిడీలో రూ. వేల కోట్ల దోపిడి కారణంగా మీతో కలిసి పని చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు జైళ్లలో మగ్గుతున్నారని చెప్పారు. పేదవాడికి ప్టటెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లు సైతం ఆపేశారని గుర్తు చేశారు. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గెజిట్ నోట్ విడుదలైతే తట్టుకోలేక రాజధానిపై విషం చిమ్ముతున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో వైసీపీ తప్ప అన్ని పార్టీలు అమరావతికి మద్దతు తెలిపాయని ఈ సందర్భంగా దేవినేని ఉమా గుర్తు చేశారు. హంద్రీనీవా, గాలేరు–నగరి, గండికోట ద్వారా రాయలసీమ చివరి ప్రాంతంలోని భూములకు సైతం నీళ్లు వెళుతుంటే ఒక్క మంచి మాట కూడా మాట్లాడలేక పోతున్నారంటూ వైసీపీ నేతల వైఖరిపై నిప్పులు చెరిగారు. హైదరాబాదులో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్లు నిర్మిస్తుంటే విషం చిమ్మిన వారే.. వైసీపీగా రూపాంతరం చెంది నేడు అమరావతిపై అక్కసు వెళ్ళగక్కుతున్నారని వివరించారు. ఈటీవీ, టీవీ 5, ఏబీఎన్‌లపై ఐదేళ్లు వేధింపులకు పాల్పడి.. అధికారం కోల్పోయినా విషం చిమ్మడం మాత్రం మానలేదంటూ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతల తీరును విమర్శించారు. మీకు అధికారం కావాల్సింది.. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పడానికేనా? అంటూ వైఎస్ జగన్‌కు దేవినేని ఉమా చురకలంటించారు. మళ్లీ అధికారంలోకి రావడం అనేది కల్లా.. ఇకనైనా ఉత్తర కుమార ప్రగల్భాలు మానండంటూ వైసీపీ నేతలకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నిర్మించిన భవనాల్లోనే ఐదేళ్లు పరిపాలన చేశారని వైసీపీ నేతలకు గుర్తు చేశారు. మావిగన్ పేరుతో రెచ్చగొట్టాలనుకున్న వైసీపీ వాళ్లకు సీఆర్డీఏ పరిధి తెలుసా? అంటూ దేవినేని ఉమా సూటిగా ప్రశ్నించారు.

## సూరేపల్లిలో ప్రభుత్వ స్టాళ్ల పరిశీలన

**రాజముద్రతో కూడా పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ**

బాపట్ల,ఏప్రిల్9 : బాపట్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. గురువారం ఉదయం భట్టిప్రోలు మండలం సూరేపల్లి చేరుకున్న సీఎం... అక్కడ ఏర్పాటు చేసిన గ్రామసభకు హాజరయ్యారు. ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు. అమరావతి గెజిట్ వచ్చాక సీఎం మొదటి పర్యటనగా బాపట్లకు వచ్చారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్టాన్ని నాశనం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వేమూరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆగిన అభివృద్ధి ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కిందన్నారు. సీఎం ఆలోచనల మేరకు ఉద్యాన పంటలు పెంచడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మూత పడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని.. ఈ ప్రాంతంలోని కాలువలు ఆధునీకరించాలని సీఎంను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. తాను లోక్‌సభ ప్యానెల్ స్పీకర్‌గా ఉన్నప్పుడు అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందిందని బాపట్ల ఎంపీ టి.కృష్ణ ప్రసాద్ అన్నారు. అన్ని పార్టీలు అమరావతి జై అంటే ఒక్క పార్టీ మాత్రమే వ్యతిరేకించిందని తెలిపారు. వైసీపీ అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ సభ నుంచి బాయ్‌కాట్ చేసిందని విమర్శించారు. జగన్ వల్ల రాష్ట్ర అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు వల్లే మళ్లీ అమరావతి నిలబడిందని ఎంపీ తెలిపారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూములు లాక్కున్నారని మండిపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'మీ భూమి – మీ హక్కు' పేరిట రక్షణ కల్పించిందని ఎంపీ కృష్ణప్రసాద్ వెల్లడించారు.

## మావిగన్ పేరుతో మరో నాటకం

**ఇది చెబితేనే జనం నవ్వుకుంటున్నారు**

**జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత**

ఏలూరు,ఏప్రిల్9 : మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

## కేంద్ర చట్టానికి నిరసనగా ట్రాన్స్‌జెండర్ల ప్రదర్శన

నాగర్‌కర్నూల్,ఏప్రిల్ 9 : ట్రాన్స్ జెండర్ల హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాన్స్ జెండర్లు భారీ ధర్నా నిర్వహించారు. ఈ చట్టం తమకు అనుకూలంగా లేదని వాపోయారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాజంలో తమకు సమాన హక్కులు కల్పించాలని కోరారు.




# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్ కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.



# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు.సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.











# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.






Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com